## మీసేవ వినియోగ ఛార్జీలు 50% పెంపు

సేవలన్నింటిపై 18 శాతం జీఎస్టీ
ప్రజలు, విద్యార్థులపై ఆర్థిక భారం
తక్షణమే అమల్లోకి రానున్న ప్రభుత్వ ఉత్తర్వులు

03



E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 02-04-2026 (వారం) గురువారం సంపుటి: 02 || సంచిక:90 || పేజీలు–6 www.ekaburu.com




# అస్సాంలో.. మూడోసారి.. మేమే!

### కాంగ్రెస్ యువరాజుకు వందోసారి ఓటమి తథ్యం
### అస్సాం ఎన్నికల ప్రచారంలో తేల్చిచెప్పిన ప్రధాని మోదీ

ఈకబురు,గువాహటి: అస్సాంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చొరబాటుదార్ల రక్షణ కోసం చట్టం తీసుకొస్తారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ కుట్రలను సాగనిచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఆయన బుధవారం అస్సాంలో పర్యటించారు. ధెమాజీ జిల్లాలోని గోగాముఖ్, బిశ్వనాథ్ జిల్లాలోని బెహాలీలో ఎన్నికల ప్రచార సభల్లో ప్రసంగించారు. మెజార్టీ ప్రజల ను మైనార్టీలుగా మార్చేసి, చొరబాటుదార్లను శాశ్వతంగా ఓటుబ్యాంకుగా మార్చుకోవడమే కాంగ్రెస్ అసలు లక్ష్యమని ధ్వజమెత్తారు. 2014లో బీజేపీ అధికారంలోకి రాకముందు చొరబాటుదార్ల కోసం కేంద్రంలో చట్టం తీసుకురావడానికి కాంగ్రెస్ ప్రయత్నించిందని గుర్తుచేశారు. ఆ పార్టీ కుతంత్రాలను ఎన్డీయే అడ్డుకుందని వెల్లడించారు. ఇప్పుడు కూడా చొరబాటుదార్లను కాపాడుతామంటూ కాంగ్రెస్ నాయకులు బహిరంగంగానే చెబుతున్నారని విమర్శించారు. దేశ విభజన సమయంలో ముస్లిం లీగ్ చేసినట్టుగానే నేడు కాంగ్రెస్ సైతం సమాజాన్ని ముక్కలు చేయాలని చూస్తోందని ఆరోపించారు.

మిగతా 2లో

### త్రివేండ్రం కమ్యూనిస్టు,
# ఢిల్లీ కమ్యూనలిస్టు
### కేరళ సీఎం విజయన్, ప్రధాని మోదీపై సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజం



- వారిద్దరినీ ఓడిస్తేనే కేరళకు మంచి రోజులు
- లెఫ్ట్ ఫ్రంట్‌కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్టే..
- కేరళలో రేవంత్ ఎన్నికల ప్రచారం
- సీఎంవ్యాఖ్యలను తప్పుబట్టిన కూనంనేని

ఈ కబురు, హైదరాబాద్: కేరళలో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్)కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్టేనని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఢిల్లీ కమ్యూనలిస్టు ప్రధాని నరేంద్ర మోదీ, తివేండ్రం కమ్యూనిస్టు ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను ఓడగొడితేనే కేరళకు మంచి రోజులు వస్తాయన్నారు. మోదీ–విజయన్‌లవి విభిన్న భావజాలాలైనా, భావాలొక్కటేనని, ఎల్డీఎఫ్– బీజేపీ మధ్య ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు.


మిగతా 2లో



### డిజిటల్ జనగణన
# తొలిదశ ప్రారంభం
### స్వయంగా వివరాలను నమోదుచేసిన రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని

ఈ కబురు, ఢిల్లీ:
జన గణన2027 తొలి దశలో భాగంగా ఢిల్లీ సహా 8 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో డిజిటల్ పద్ధతిలో స్వీయ నమోదు ప్రక్రియ మొదలైంది

మిగతా 2లో



6

## లఖ్‌నవూపై ఢిల్లీ ఘనవిజయం

ఐపీఎల్‌లో మరో మ్యాచ్ స్వల్ప స్కోర్లతో ఉత్కంఠభరితంగా ముగిసింది. లక్నో సూపర్ జెయింట్స్‌తో 142 పరుగుల లక్ష్య ఛేదనలో ఒకదశలో 26/4తో నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ చివరకు గట్టెక్కింది. యువ ఆటగాడు సమీర్ రిజ్వీ ముందుండి నడిపించగా, ట్రిస్టన్ స్టబ్స్ అతనికి అండగా నిలిచాడు. అంతకుముందు ఢిల్లీ బౌలర్ల ముందు నిలవలేక టాప్–5లో ముగ్గురు సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడంతో లక్నో ఇన్నింగ్స్ స్వల్ప స్కోరుకే ముగిసింది. ఈ సీజన్‌లో నాలుగు మ్యాచ్‌ల తర్వాత ఒక టీమ్‌కు 'హోం గ్రౌండ్'లో ఓటమి ఎదురైంది.



03

### కాజీపేట రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయండి: అశ్విని వైష్ణవ్‌కు కేటీఆర్ లేఖ

ఈ కబురు, హైదరాబాద్:
తెలంగాణలోని కాజీపేట కేంద్రంగా నూతన రైల్వే డివిజన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారు.

### గ్రూప్ -1 తరహాలో డిగ్రీ లెక్చరర్ పోస్టుల్లో
# అక్రమాలకు కుట్ర

జీవో నంబర్ 104, జీవో నంబర్ 29, జీవో నంబర్ 46, జీవో నంబర్ 81 లను వెంటనే రద్దు చేయాలి

- యువతకు ఉద్యోగాలు దక్కకుండా జీవోలతో ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోంది
- డిగ్రీ లెక్చరర్ల ఉద్యోగాలను తమవారికే ఇచ్చేలా జీవో నంబర్ 4 తీసుకొచ్చింది
- హెచ్చ్‌డీ కి 25 మార్కులు వెయిటేజ్ ఇవ్వటం కూడా కుట్రలో భాగమే
- గ్రూప్-1 లో ఏ విధంగా తమ వారికి ఉద్యోగాలు ఇచ్చుకున్నారో ఇప్పుడు అదే కుట్ర చేస్తున్నారు
- ప్రతి నోటిఫికేషన్ కు ఏదో ఒక జీవో అడ్డం పెట్టి నిరుద్యోగులకు అన్యాయం చేస్తున్నారు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



ఈ కబురు, హైదరాబాద్ :
గ్రూప్ 1 తరహాలో డిగ్రీ కాలేజీ లెక్చరర్ పోస్టులను తమవారికి కట్టబెట్టడానికి కుట్రలు చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు దక్కకుండా జీవోల పేరుతో ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని కవిత మండిపడ్డారు. ప్రభుత్వం ఏ నోటిఫికేషన్ వేసిన సరే దానికి ఒక జీవో అడ్డంకిగా మారిందన్నారు. ముఖ్యంగా డిగ్రీ లెక్చరర్ల పోస్టుల కోసం వేసిన నోటిఫికేషన్ కు అడ్డుగా జీవో నంబర్ 4 తెచ్చారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

మిగతా 3లో



2

## హర్మూజ్ తెరిచేవరకు భీకర దాడులే; ట్రంప్

ఈ కబురు: ఇరాన్ యుద్ధానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. కాల్పుల విరమణ కోసం ఆ దేశ

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- 'భూభారతి'తో తొలి అడుగు
- నేటి నుంచి 5 మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



02

## భూ భారతికి మస్కా

- అధికారులపై తుంగతుర్తి మాజీ ప్రజాప్రతినిధి బావమరిది ఒత్తిళ్లు
- సూర్యాపేట జిల్లా కేంద్రంలో నాలా భూమికి పట్టా

ఈ కబురు, హైదరాబాద్:
నాలా అనుమతులు జారీ అయ్యాయి... వ్యవసాయ భూమిని వెంచర్ వేసి విక్రయించారు... రిజిస్ట్రేషన్లు కూడా పూర్తయ్యాయి. అక్కడ వ్యవసాయ భూమి మచ్చుకైనా లేదు. అయినప్పటికీ భూ భారతిలో ఆ భూమికి పట్టా పాసుపుస్తకాలు జారీ చేశారు. రెవెన్యూ అధికారులు భూ భారతి పోర్టల్‌కు మస్కా కొట్టారు.



02

# దాడులు ఉధృతం



- కువైట్ విమానాశ్రయంపైకి ఇరాన్ డ్రోన్లు
- చమురు ట్యాంక్ పేలి భారీగా మంటలు
- ఖతర్‌లో చమురు నౌకపైనా దాడులు
- యూఏఈలో భారతీయునికి గాయాలు
- ఇరాన్‌పై ఇజ్రాయెల్ బాంబుల వర్షం
- టెహ్రాన్‌లో ఫెంటానిల్ ఫ్యాక్టరీపై దాడి

ఈ కబురు, దుబాయ్/వాషింగ్టన్: పశ్చిమాసియాలో ఇజ్రాయెల్–అమెరికా, ఇరాన్ నడుమ యుద్ధం తీవ్రస్థాయిలో కొనసాగుతూనే ఉంది. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఇరాన్ బుధవారం దాడులకు దిగింది.


మిగతా 2లో

# ఏపికి అమరావతే ఏకైక రాజధాని
## ..ఎవరూ అంగుళం కూడా కదల్చలేరు

- పార్లమెంటులో బిల్లుపై స్పందించిన సీఎం
- చేనేతలకు అండగా దండగా ప్రజా ప్రభుత్వం
- రాష్ట్రంలో 5 చోట్ల హ్యాండ్లూమ్ క్లస్టర్ల ఏర్పాటు
- సుపరిపాలనా మహాయజ్ఞాన్ని అడ్డుకుంటే సహించేది లేదు
- రాష్ట్రంలో కొందరు చేసేవి హిట్ అండ్ రన్ నేర రాజకీయాలు


ఈ కబురు, అమరావతి :
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఇక అమరావతే ఏకైక రాజధాని అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఎవరూ అంగుళం కూడా రాజధానిని కదల్చలేరని ఆయన అన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందటంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా వింజమూరులో పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి... ప్రజావేదిక సభలో ప్రసంగించారు. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని.. లోక్‌సభలో చట్టబద్ధత బిల్లుకు ఆమోదం పొందటం ఆంధ్రులకు దక్కిన గౌరవమని సీఎం అన్నారు. బిల్లు ఆమోదంతో అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని తెలిపారు. ఆనందించారని సీఎం ఆరోపించారు.

మిగతా 2లో



## జాబిల్లి దిశగా.. నింగిలోకి దూసుకెళ్లిన 'ఆర్టెమిస్-2' రాకెట్

ఈ కబురు : అంతరిక్ష ప్రయోగంలో మరో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. చంద్రుడి వద్దకు మానవులను పంపేందుకు ఉద్దేశించిన 'ఆర్టెమిస్2'ను అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) తాజాగా ప్రయోగించింది.



03

# త్రివేండ్రం కమ్యూనిస్టు, ఢిల్లీ కమ్యూనలిస్టు



ఈ సందర్భంగా రేవంత్ కేరళ సీఎం పినరయి విజయన్‌ను ప్రధాని మోదీతో పోల్చారు. ప్రధాని మోదీకి, కేరళ సీఎం విజయన్‌కు తేడా ఏమీ లేదని, విజయన్ ద్వారా కేరళ భవిష్యత్తును అపహరించాలని మోదీ చూస్తున్నారని పేర్కొన్నారు. అందులో భాగంగానే బీజేపీ ఓటు బ్యాంకు విజయన్‌కు బదిలీ అయ్యేలా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను కేరళలోకి రానీయకుండా లక్ష్మణ రేఖ గీసింది యూడీఎఫ్ మాత్రమేనని అన్నా రు. కేరళ ప్రజలు బీజేపీ, ఎల్డీఎఫ్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎవరినైనా బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐతో వేధిస్తుందని, విజయన్‌సర్కారుపై ఈగ కూడా వాలనీయదని ఆరోపించారు. కేరళ సమగ్రాభివృద్ధి యూడీఎఫ్ లక్ష్యమన్నారు.

మలయాళంలో పలకరింపు

గత పన్నెండేళ్లుగా ఢిల్లీలో... పదేళ్లుగా కేరళలో పరిస్థితులు పూర్తిగా దిగజారాయని సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో మోదీ, కేరళలో విజయన్ డబుల్ ఫెయిల్యూర్‌గా నిలిచారని ధ్వజమెత్తారు. ఇరువురి సిద్ధాంతాలు వేరైనా వైఫల్యాలు మాత్రం ఒకేలా ఉన్నాయని మండిపడ్డారు. నిరుద్యోగంతో ఇక్కడి యువత ఇబ్బంది పడుతోందని, అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని విమర్శించారు. సోనియా గాంధీ దత్తత తీసుకున్న తెలంగాణ అభివృద్ధి మార్గంలో పయనిస్తోందని.. కేరళ కూడా అలానే ముందుకు వెళ్లాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు. కేరళ అభివృద్ధికి రాహుల్ గాం□దీ, ప్రియాంక గాంధీ నాయకత్వం వహిస్తారని, వారిద్దరూ కేరళ కుటుంబ సభ్యుల్లా మారారని తెలిపారు. ప్రముఖ మలయాళ నటుడు మోహన్‌లాల్ ఓ సినిమాలో చెప్పిన 'నీ పో మోనే.. దినేశా..' తరహాలో 'నీ పో మోనే విజయన్, యువర్ టైమ్ ఈజ్ ఓవర్' (విజయన్ నీ సమయం అయిపోయింది.. వెళ్లిపో) అంటూ రేవంత్ వ్యాఖ్యానించారు. రేవంత్ మలయాళంలో పలకరించడంతో ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. రాత్రికి ఎర్నాకులంలో బస చేసిన రేవంత్ గురువారం కూడా కేరళ ప్రచారంలో పాల్గొననున్నారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా రేవంత్‌తో కలిసి రోడ్‌షోలకు హాజరయ్యారు.

కూనంనేని ఆక్షేపణ

కేరళ సీఎం, మార్క్సిస్టు నేత పినరయి విజయన్‌ను ఉద్దేశించి రేవంత్ చేసిన వ్యాఖ్యలను తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి మిత్రపక్షంగా ఉన్న సీపీఐ తప్పుపట్టింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా విధానాలపై రేవంత్ విమర్శలు చేయొచ్చు కానీ, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సరైంది కాదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆక్షేపించారు. మోదీని విమర్శించవచ్చు కానీ, విజయన్‌ను మోదీతో పోల్చడం కూడా సరైంది కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వం వహిస్తున్న ఇండియా కూటమిలో వామపక్షాలు కూడా కీలక భాగస్వాములనే విషయాన్ని రేవంత్ గుర్తుపెట్టుకోవాలని కూనంనేని వ్యాఖ్యానించారు.

# అస్సాంలో మూడోసారి.. మేమే!

భ్రష్టాచార్ కీ జనని కాంగ్రెస్

''ఓట్ల ఏకీకరణపై బీజేపీకి విశ్వాసం లేదు. మేము నమ్మే సూత్రం సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ మాత్రమే. అభివృద్ధికి, సాంస్కృతిక వారసత్వానికి ఓటు వేయాలి. అస్సాంను మరింత అభివృద్ధి చేసే బాధ్యత మాదే. రాష్ట్రంలో హ్యాట్రిక్ సాధించబోతున్నాం. ప్రజల ఆశీస్సులతో ఈ ఎన్నికల్లో నెగ్గి వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. కాంగ్రెస్ యువరాజు(రాహుల్ గాంధీ)కి వందోసారి కూడా ఓటమి తప్పదు. యువతకు మరిన్ని ప్రభుత్వ ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేలా బీజేపీ మేనిఫెస్టో రూపొందించాం. అస్సాంలో ఎన్నో వనరులు ఉన్నప్పటికీ గత కాంగ్రెస్ ప్రభుత్వాలు వాటిని ఉపయోగించుకోలేదు. రాష్ట్ర అభివృద్ధిపై దృష్టిపెట్టలేదు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారిపోయింది. ఇక్కడి వనరుతోనే రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి వ్యతిరేకం. అది అవినీతికి తల్లిలాంటిది(భ్రష్టాచార్ కీ జనని). అస్సాం ఆత్మగౌరవాన్ని, భద్రతను కాపాడే విషయంలో రాజీపడింది'' అని మోదీ ధ్వజమెత్తారు.

ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తాం

''మేము మళ్లీ అధికారంలోకి వస్తే అస్సాంలో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలు చేస్తాం. ఆరో షెడ్యూల్ కింద గిరిజనులకు రక్షణలు కల్పిస్తాం. అస్సాం గుర్తింపు, గౌరవాన్ని కాపాడుతాం. రాష్ట్రంలో పదేళ్ల బీజేపీ పాలన సేవ, సుశాసన్‌కు బాటలు వేసింది. తేయాకు సాగుకు ప్రసిద్ధి పొందిన అస్సాం నేడు సెమీకండక్టర్ల తయారీ హబ్‌గా మారడం సంతోషంగా ఉంది''అని మోదీ ఉద్ఘాటించారు.

తేయాకు తోటలో కార్మికుడిగా మోదీ

అస్సాం రాష్ట్రం దిబ్రూగఢ్ జిల్లాలో మనోహరి టీ ఎస్టేట్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. 19 మంది మహిళా కూలీలతో కలిసి కొద్దిసేపు పనిచేశారు. స్వయంగా తోటలోకి దిగి తేయాకు తెంపి, సంప్రదాయ బుట్టలోకి సేకరించారు. తేయాకు తోటలో పనిచేయడం మర్చిపోలేని అనుభవమని మోదీ పేర్కొన్నారు. తన జీవితం ఛాయ్‌తో ముడిపడి ఉందన్నారు. టీ చెట్ల నుంచి తేయాకు ఎలా తెంచాలన్నది



మహిళలను చూసి నేర్చుకున్నానని తెలిపారు. మహిళలతో మాట్లాడారు. వారి పిల్లల చదువుల గురించి ఆరా తీశారు. అలాగే వంటల గురించి అడిగి తెలుసుకున్నారు. వారిలో ఒక మహిళను తన గురువుగా మోదీ అభివర్ణించారు. మరో మహిళ పాట పాడి వినిపించారు. తేయాకు అస్సాం ఆత్మ అంటూ మోదీ ఎక్స్‌లో పోస్టుచేశారు. ఇక్కడ సాగవుతున్న టీ ప్రపంచమంతటా సరఫరా అవుతోందని వివరించారు. టీ కార్మికుల శ్రమ, పట్టుదల అస్సాంకు గర్వకారణమని స్పష్టంచేశారు.

# ఏపికి అమరావతే ఏకైక రాజధాని

బిల్లు ఆమోదంతో అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని తెలిపారు. రాజధానిని విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని ఆయన వెల్లడించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాలకు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి.. ఈ బిల్లుకు మద్దతు పలికిన పార్టీలకు రాష్ట్ర ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియచేశారు. గత పాలకులు మూడు ముక్కలాటతో విధ్వంసం చేసి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని ఆక్షేపించారు. రాజధానికి చట్టబద్ధత కల్పించే అంశంపై అసెంబ్లీలో తీర్మానం పెడితే కనీసం శాసనసభ సమావేశాలకు కూడా ఆ పార్టీ హాజరు కాలేదన్నారు. రాజధాని ప్రాంతాన్ని స్మశానమని, ఏడారి అని, ముంపు ప్రాంతమని ఎగతాళి చేసి ఆనందించారని సీఎం ఆరోపించారు.

--సంక్షేమానికి పెద్దపీట

ప్రతీ నెలా మొదటి తేదీన పేదల సేవలో ద్వారా పెద్ద ఎత్తున సంక్షేమం చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు అంతా పేదల సేవలో ఉంటున్నామని తెలిపారు. ప్రతీ నెలా రూ.2,750 కోట్లను పెన్షన్ల కోసం వ్యయం చేస్తున్న ప్రభుత్వం ఏపీనే అని సీఎం వివరించారు. పొరుగున తమిళనాడులో కేవలం రూ. వెయ్యి మాత్రమే పెన్షన్ గా ఇస్తున్నారని అన్నారు. ప్రజలపై ఉన్న అభిమానంతోనే పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాల్ని చేయగలుగుతున్నామని సీఎం వివరించారు. గత ఏడాది జూన్ లో తల్లికి వందనం కింద ఆర్థిక సహకారం అందించామని.. ఈ ఏడాది జూన్ లోనూ తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని తెలిపారు. దీపం 2.0 కింద ఏడాదికి 3 ఉచిత సిలెండర్లను ఇస్తున్నామని త్వరలోనే ప్రతీ ఇంటికీ పైప్ ద్వారా గ్యాస్ అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. దీని కోసం ఏడాదికి రూ.2400 సబ్సీడిని కూడా వినియోగదారుల ఖాతాల్లో వేస్తామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం అడ్వాన్సుగా రూ.1300 కోట్లను ఇచ్చిందని గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామన్నారు. పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు పీ4 కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. 25 వేల కుటుంబాల్ని దత్తత తీసుకునేందుకు అదానీ ట్రస్టు కూడా ముందుకు వచ్చిందని ముఖ్యమంత్రి వివరించారు.

జువ్వలదిన్నెపై దుష్ప్రచారం

ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు పాతచెరువుకు సోమశిల కాలువ నుంచి నీటిని తరలించేందుకు రూ.34 కోట్లతో పనులు చేపడతామని దీనిపై తక్షణం ఆదేశాలు జారీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ ఏడాది అక్టోబరు నాటికి చెరువును నింపుతామని భరోసా ఇచ్చారు. నీటి భద్రత కోసం స్థానిక వింజమూరు ప్రజలు వేసిన ఒక్క అడుగుకు ప్రజా ప్రభుత్వం వంద అడుగులు ముందుకు వేసి తోడుగా నిలబడుతుందన్నారు. రూ.70 లక్షల వ్యయంతో చెరువును పునరుద్దరణకు తీసుకున్న చొరవను ముఖ్యమంత్రి అభినందించారు. నీటి సంరక్షణ కోసం ప్రజలు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. నెల్లూరు జిల్లాలో పెద్ద ఎత్తున పారిశ్రామిక అభివృద్ధి జరుగుతోందని .. రామాయపట్నం పోర్టు, దుగరాజపట్నం షిప్ బిల్డింగ్ సెంటర్ తో పాటు రక్షణ పరికరాలు, మానవ రహిత విమానాలు తయారవుతాయని .. ఇఫ్కో సెజ్ లో ఏర్పాటు కానున్న సౌర ఫలకాల తయారీ సహా వేర్వేరు పరిశ్రమల ద్వారా 80 వేల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని 2018 లోనే కేంద్రానికి లేఖ రాసి ఫిషింగ్ హార్బర్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు చేసినట్టు ముఖ్యమంత్రి వెల్లడించారు. రూ.285 కోట్లతో దీని నిర్మాణం చేపట్టామని.. దీనిని వక్రీకరించి కొందరు హిట్ అండ్ రన్ నేరాల రాజకీయం చేస్తున్నారని సీఎం ఆక్షేపించారు. 201924 మధ్య జరిగిన అరాచక, విధ్వంస పాలన కొనసాగిందని అలాంటి వ్యక్తిని తన జీవితంలో చూడలేదని ముఖ్యమంత్రి అన్నారు. కూటమి పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఎవరూ మత్స్యకారులకు అన్యాయం చేసే పరిస్థితి ఉండదన్నారు. తమిళనాడు నుంచి వచ్చే మత్స్యకారులు ఎవరూ మన జలాల్లో చేపల వేట చేయకుండా నిఘా పెట్టాలని నెల్లూరు, తిరుపతి కలెక్టర్లను సీఎం వేదిక నుంచి ఆదేశించారు.



--నేతన్నలకు వెన్నుదన్నుగా ఉచిత విద్యుత్

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ ఇవాళ్టి నుంచి చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమల్లోకి తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. 93 వేల చేనేత మగ్గాలకు 200 యూనిట్ల వరకూ, 11,488 పవర్ లూమ్ లకు 500 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్ అందిస్తామని తెలిపారు. దీని కోసం మొత్తం 153 కోట్లను వ్యయం చేస్తున్నామని.. ఉచిత విద్యుత్ పథకం వల్ల ఒక్కో చేనేత కుటుంబానికి వేల రూపాయల మేర ఆదా అవుతుందన్నారు. నేతన్న సంక్షేమానికి.. వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. చేనేతల సంక్షేమం కోసం రూ.5 కోట్లతో థ్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటు చేశామని.. 55 ఏళ్లకే పెన్షన్ కూడా అందిస్తున్నట్టు తెలిపారు. నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ పథకం కింద 5 చోట్ల హ్యాండ్లూమ్ క్లస్టర్లను ప్రారంభించబోతున్నట్టు సీఎం ప్రకటించారు. అనంతరం లబ్దిదారులకు ఉచిత విద్యుత్ సరఫరా ధృవపత్రాలను అందించారు. 21 నెలల్లో 5.5 లక్షల గృహప్రవేశాలు చేయించామని.. డిసెంబరు లోగా 4.5 లక్షల ఇళ్లలో ప్రవేశించేలా నిర్మాణాలు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి వివరించారు. ప్రజలందరికీ పౌరసేవలు మెరుగ్గా అందించటంతో పాటు వాటిపై ప్రజాభిప్రాయాన్ని కూడా సేకరిస్తున్నామని తెలిపారు. పౌరసేవలు సరిగా అందకపోయినా.. మౌలిక సదుపాయాలు కల్పించకపోయినా ఆకస్మిక తనిఖీలు చేసి కఠినంగా వ్యవహరిస్తానని సీఎం స్పష్టం చేశారు. సుపరిపాలనా మహాయజ్ఞానికి ఎవరు నష్టం కలిగించినా సహించబోనని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ప్రజావేదిక సమీపంలో సూక్ష్మసేద్యం సహా డ్రోన్ సహకారంతో సేద్యానికి సంబంధించిన స్టాళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి ఫరూఖ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీదమస్తాన్ రావు, ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్, జిల్లా కలెక్టర్ హిమాన్షూ శుక్లా తదితరులు హాజరయ్యారు.

## డిజిటల్ జనగణన తొలిదశ ప్రారంభం



**రాష్ట్రపతి భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్వయంగా జనగణన పోర్టల్‌లో తన కుటుంబ వివరాలను నమోదు చేశారు. 15 రోజులపాటు ఈ పోర్టల్ లేదా యాప్ సంబంధిత కేంద్రపాలిత, రాష్ట్రాల ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కూడా తమ గృహ వివరాలను డిజిటల్ ప్రక్రియలో నమోదు చేశారు. "నేను నా వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేశాను. భారత ప్రజలు కూడా తమ గృహ వివరాలను నమోదు చేసి ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలి" అని ప్రధాని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ సారి జనగణన ప్రక్రియలో తొలిసారి స్వీయ నమోదును ప్రవేశపెట్టారు.**

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

ఈ కబురు, హైదరాబాద్:


రాష్ట్రంలో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపించాలన్న సంకల్పంతో... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా రైతులకు పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడానికి ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ 'ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్'ను రూపొందించామన్నారు. ఈ పోర్టల్‌ను ఈ నెల 2 నుంచి 5 మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించి.. భూవివాదాల పరిష్కారానికి తొలి అడుగు వేయబోతున్నట్లు వెల్లడించారు. వచ్చే ఫలితాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు, చేర్పులు చేసి ముందుకెళ్లాలని నిర్ణయించినట్లు చెప్పారు. కేరళ పర్యటనలో ఉన్న మంత్రి పొంగులేటి బుధవారం పోర్టల్ ప్రారంభానికి సంబంధించి రెవెన్యూ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ''ఈ పోర్టల్‌ను రైతు కోణంలో రూపొందించాం. అన్నదాతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గురువారం నుంచి ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాం. ఆయా జిల్లాల కలెక్టర్లు పోర్టల్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి. గతంలో మాదిరిగా రైతులు తమ భూసేవల కోసం మీసేవా కేంద్రాలకు వెళ్లాల్సిన పనిలేకుండా.. ఇంటి నుంచే పొందేలా పోర్టల్‌ను తయారు చేశాం. రైతు లాగిన్ అయిన వెంటనే.. తనకున్న భూమి వివరాలు కనిపిస్తాయి. ఎన్ని ఎకరాలకు సర్వే కావాలో కోరితే.. అందుకు సంబంధించిన ఫీజు ఎంత చెల్లించాలో కనిపిస్తుంది. చెల్లించిన తర్వాత ఆ వివరాలు గ్రామంలోని లైసెన్స్‌డ్ సర్వేయర్ లాగిన్‌కు వెళ్తాయి. రెండు రోజుల్లో ఆ రైతు భూమికి ఆనుకొని ఉన్న రైతులకు నోటీసులు జారీచేస్తారు. తర్వాత ఏడు రోజుల్లోపు సర్వే తేదీని ఆ లైసెన్స్‌డ్ సర్వేయర్ ఖరారు చేయడమే కాకుండా.. సర్వే కూడా పూర్తిచేస్తారు. దీన్ని సిస్టమ్‌లో నమోదుచేశాక.. అది మండల సర్వేయర్ పరిశీలనకు వెళ్తుంది. అనంతరం తహసీల్దార్ ఆమోదం పొందాక.. దరఖాస్తుదారైన రైతుకు ఎల్పీఎం, భూధార్ నంబర్లను కేటాయిస్తారు. ఈ వివరాలు భూభారతి పోర్టల్‌లో కూడా నిక్షిప్తమవుతాయి. సర్వే పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్‌ను జనరేట్ చేసి.. పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ ప్రక్రియలో దరఖాస్తు రిజిస్ట్రేషన్ ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యేవరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ ఎలర్ట్‌లు పంపిస్తారు. ఈ 5 మండలాల్లో ప్రతి సర్వే మ్యాప్ (ఎల్పీఎం)నకు యూనిక్ నంబరు, ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ మాదిరిగా భూధార్

# భూ భారతికి మస్కా

ఆయన చక్రం తిప్పి కొందరు అధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ వ్యవహారాన్ని చక్కబెట్టినట్లు తెలుస్తోంది. రూ.కోట్ల విలువైన భూమి కావడంతో అక్రమాలకు తెరలేపినట్లు సమాచారం. అక్రమాలకు తావు లేకుండా ప్రభుత్వం భూ భారతి పోర్టల్ తీసుకొచ్చినా హక్కుల మార్పిడి సందర్భంగా విచారణ చేయాలన్న చట్టంలోని నిబంధనలు అమల్లోకి రాకపోవడంతో కొందరు అధికారులు ఇలాంటి వాటికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సూర్యాపేట శివారులో రూ.కోట్ల విలువైన భూమి కావడంతో ఆ భూమి హక్కులను దొడ్డిదారిన మార్చారన్న చర్చ జరుగుతోంది. దీనిపై బాధితులు హైదరాబాద్‌లోని భూ పరిపాలన ప్రధాన కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు.

--లేని భూమికి భూ భారతిలో...

సూర్యాపేట మండల పరిధిలోని సర్వే నంబరు 71/3లోని 2.34 ఎకరాల భూమి ఉంది. కోదాటి ఆండాళమ్మ నుంచి ఈ భూమి చేతులు మారుతూ కొండపల్లి వెంకటరెడ్డి, బొలిశెట్టి శ్రీరాములు, కొరివి వీరన్న, ధారవత్ భిక్షం అనే నలుగురు యజమానుల పేర్లపైకి వచ్చింది. యఫ్/13036/09, 10/02/2009 దస్త్రాలతో యాజమాన్య హక్కుల మార్పిడి జరిగింది. వారు వ్యవసాయ భూమిని నాలా కన్వర్షన్ ఫీజు చెల్లించి వ్యవసాయేతర భూమిగా మార్చుకున్నా



రు. ఆ భూమిలో లేఅవుట్ వేసి వెంచరుగా మార్చి ప్లాట్లను విక్రయించారు. మరోవైపు 2024లో ఆండాళమ్మ మనవడు శ్యాంసుందర్ పేరుతో వారసత్వ బదిలీ కింద ఈ భూమికి భూ భారతి పోర్టల్లో హక్కులు మార్చారు. తిరిగి ఈ ఏడాది జనవరిలో ఒక ఎకరా విస్తీర్ణాన్ని మరొకరి పేరుతో భూ భారతిలో రిజిస్ట్రేషన్ చేశారు. వాస్తవానికి క్షేత్రస్థాయిలో వ్యవసాయ భూమి లేకున్నా పోర్టల్లో మార్పిడి చేసేశారు. నలుగురు బాధితులు వెంటనే జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. 2025, అక్టోబరు 13న బాధితులు జిల్లా కలెక్టర్‌కు ఆధారాలను సమర్పించి తదుపరి లావాదేవీలు జరగకుండా చూడాలని కోరారు. కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్లకు పంపారు. అయినప్పటికీ 2026 జనవరిలో వేరే వ్యక్తులకు భూమిని రిజిస్ట్రేషన్ చేశారు.

# దాడులు ఉధృతం

ఈ కబురు, దుబాయ్/వాషింగ్టన్: పశ్చిమాసియాలో ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ నడుమ యుద్ధం తీవ్రస్థాయిలో కొనసాగుతూనే ఉంది. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఇరాన్ బుధవారం దాడులకు దిగింది. అక్కడి ఇంధన నిల్వ ట్యాంకులనే లక్ష్యంగా చేసుకుని డ్రోన్లు ప్రయోగించింది. ఒక ట్యాంక్ పేలిపోయి విమానాశ్రయంలో భారీగా మంటలు చెలరేగినట్టు కువైట్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది.

ఖతర్ తీర సమీపంలో ఆ దేశానికి చెందిన ఓ చమురు నౌకపై కూడా ఇరాన్ క్రూయిజ్ క్షిపణితో దాడి చేసింది. దాంతో అందులోని 21 మంది సిబ్బందిని హుటాహుటిన ఖాళీ చేయించారు. యూఏఈలోని ఫుజైరాలో డ్రోన్ శకలాలు తాకి ఒక వ్యక్తి మరణించాడు. బహ్రెయిన్‌పై కూడా ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడులకు దిగింది. పలు క్షిపణులు, డ్రోన్లను నేలకూల్చినట్టు జోర్డాన్, సౌదీ అరేబియా ప్రకటించాయి

యూఏఈలోని ఉమ్ అల్ థౌబ్ పారిశ్రామిక ప్రాంతంపై ఇరాన్ జరిపిన డ్రోన్ దాడిలో ఒక భారతీయుడు గాయపడ్డాడు. బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తి మరణించాడు. తన ప్రధాన శత్రువైన ఇజ్రాయెల్‌పై కూడా ఇరాన్ భారీ స్థాయిలో విరుచుకుపడింది. దేశవ్యాప్తంగా పలు నగరాలపై క్షిపణులు, డ్రోన్ల వర్షం కురిపించింది. దాంతో ఎక్కడ చూసినా సైరన్ల మోత వినిపించింది. ఐదుగురికి పైగా గాయపడ్డట్టు సమాచారం.

హూతీ రెబెల్స్ కూడా ఇజ్రాయెల్‌పైకి క్షిపణులు ప్రయోగించారు! ఉత్తర ఇరాక్‌లోని ఇర్బిల్‌లో బ్రిటన్ ఇంధన సంస్థ బీపీకి చెందిన నిల్వ కేంద్రంపై డ్రోన్ దాడులు జరిగాయి. దాంతో అక్కడ మంటలు చెలరేగినట్టు సమాచారం. ఇరాన్‌కు దన్నుగా యుద్ధ రంగంలోకి దిగేందుకు సిద్ధమని రష్యా అనుకూల చెచెన్ ఫైటర్లు ప్రకటించారు! పోరును మరింత ఉధృతం చేసేందుకు ఇజ్రాయెల్ వ్యతిరేక శక్తుల మద్దతు కూడా కూడగడతామని ఇరాన్ సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరోవైపు పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు చైనా, పాకిస్తాన్ ఐదు సూత్రాల ప్రణాళికను ప్రతిపాదించాయి.

దద్దరిల్లిన టెహ్రాన్

అమెరికా, ఇజ్రాయెల్ కూడా ఇరాన్‌పై తీవ్రస్థాయిలో దాడులకు దిగాయి. రాజధాని టెహ్రాన్ పేలుళ్లతో దద్దరిల్లిపోయింది. ఒకప్పటి అమెరికా



రాయబార కార్యాలయ భవన ప్రాంగణం భారీగా దెబ్బ తింది. టెహ్రాన్‌లో ఫెంటానిల్ ఉత్పత్తి చేస్తున్న టోఫిక్ దారు కర్మాగారాన్ని బాంబులతో నేలమట్టం చేసినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. దాన్ని రసాయినిక ఆయుధాల తయారీకి ఇరాన్ వాడుతోందని ఆరోపించింది. లెబనాన్‌పై కూడా ఇజ్రాయెల్ దాడుల తీవ్రత కొనసాగింది. రాజధాని బీరూట్‌పై జరిగిన దాడులకు ఐదుగురు బలైనట్టు ఆరోగ్య శాఖ పేర్కొంది. ఇజ్రాయెల్ సరిహద్దు ప్రాంతాల నుంచి తమ సైన్యం వెనక్కు తగ్గుతున్నట్టు తెలిపింది. లెబనాన్‌లో హెజ్బొల్లా కార్యాలయాలను లక్ష్యం చేసుకుంటామని ఇజ్రాయెల్ పేర్కొంది.

ప్రభుత్వంపై ఐఆర్‌జీసీ పట్టు!

ఇరాన్ పూర్తిగా సాయుధ రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జీసీ) విభాగం చెప్పుచేతల్లోకి వెళ్లినట్టు వార్తలొస్తున్నాయి. అధ్యక్షుడి నిర్ణయాలు, నియామకాలను పక్కన పెట్టి ప్రభుత్వంపై ఐఆర్‌జీసీయే పూర్తిస్థాయిలో పెత్తనం చేస్తోందని ఇరాన్ ఇంటర్నేషనల్ వార్తా సంస్థ పేర్కొంది.

# హర్మూజ్ తెరిచేవరకు భీకర దాడులే; ట్రంప్

ఈ కబురు: ఇరాన్ యుద్ధానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. కాల్పుల విరమణ కోసం ఆ దేశ అధ్యక్షుడు పెజెష్కియాన్ తమకు విజ్ఞప్తి చేశారన్నారు. ఆయన గత అధ్యక్షుల కంటే చాలా తక్కువ తీవ్రవాద భావాలు కలిగిన వ్యక్తి అని, అత్యంత తెలివైనవారని అన్నారు. హర్మూజ్ జలసంధిని తెరిచి, ఎటువంటి అడ్డంకులు లేకుండా నౌకల రవాణాకు అవకాశం కల్పిస్తేనే కాల్పుల విరమణను పరిగణనలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు. అప్పటివరకు ఇరాన్‌పై భీకర దాడులు కొనసాగిస్తూనే ఉంటామని ట్రంప్ హెచ్చరించారు. ఈ మేరకు 'ట్రూత్ సోషల్'లో పోస్టు పెట్టారు. యుద్ధాన్ని ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్న నేపథ్యంలో ట్రంప్ ఈ తరహా వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అయితే, తమకు కొన్ని స్పష్టమైన హామీలు వస్తేనే యుద్ధం ముగింపునకు సిద్ధమని పెజెష్కియాన్ పేర్కొన్నారు. మరోవైపు, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మాత్రం.. తాము పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. అమెరికా పశ్చిమాసియా ప్రతినిధితో ఇటీవల తాను నేరుగా మాట్లాడిన విషయం నిజమేనని అంగీకరించిన ఆయన.. ఇవి



చర్చల్లో భాగం కాదని స్పష్టం చేశారు.

## కాజీపేట రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయండి: అశ్విని వైష్ణవ్‌కు కేటీఆర్ లేఖ



ఈ లేఖను బీఆర్ఎస్ ఎంపీల బృందం ఢిల్లీలో కేంద్ర మంత్రికి అందించింది."దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్‌పై పనిభారం విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం సికింద్రాబాద్ డివిజన్ ట్రాక్ పరిధి 2,755 కిలోమీటర్లుగా ఉంది. రాబోయే రోజుల్లో వాడి- రాయచూర్, విష్ణుపురం- బీబీనగర్ డబ్లింగ్ పనులు పూర్తయితే.. అది దాదాపు 3,150 కిలోమీటర్లకు చేరుకుంటుంది. భారతీయ రైల్వేల పరిపాలనా ప్రమాణాల ప్రకారం ఒక డివిజన్‌కు ఉండాల్సిన పరిమితి కంటే ఇది చాలా ఎక్కువ. ఎక్కువ కిలోమీటర్లు, పనిభారం ఉన్నందున సికింద్రాబాద్ డివిజన్ నిర్వహణ అత్యంత సంక్లిష్టంగా మారింది. ఇది రైళ్ల రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో కాజీపేట కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయడం.. పరిపాలనా సౌలభ్యం, కార్యకలాపాల రీత్యా అత్యంత అవసరం. దీంతో ఉత్తర, తూర్పు తెలంగాణ ప్రాంతాల్లో రైల్వే సేవలు మెరుగుపడటమే కాకుండా, సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి సాధ్యమవుతుంది" అని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. ఈ విజ్ఞప్తికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీలు తెలిపారు.

# పటాన్‌చెరులో ఆగని మైనింగ్ మంట..

- ఎమ్మెల్యే, కాట పోటాపోటీ ప్రెస్ మీట్లు.. తీవ్ర ఆరోపణలు
- మహిపాల్ రెడ్డి రా.. నువ్వా నేనా తేల్చుకుందామన్న కాట శ్రీనివాస్ గౌడ్
- నాపై చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉంటే తడి బట్టలతో గుళ్లోకి రావాలని సవాల్
- మా కుటుంబం పెట్టిన భిక్షతోనే ఎమ్మెల్యే అయ్యావని ఫైర్
- అక్రమాలు చేసి వేల కోట్లు సంపాదించారని ఆరోపణ



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న పటాన్‌చెరు కాంగ్రెస్ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్

**ఈ–కబురు, పటాన్‌చెరు :** ఇటీవల హరీశ్ రావు వాఖ్యలతో అంసెబ్లీలో మొదలైన పటాన్‌చెరు మైనింగ్ పంచాయతీ ఇంకా మండుతూనే ఉంది. పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సోదరుడు మధుసూదన్ రెడ్డిని అక్రమంగా మైనింగ్ కేసులో ఇరికించి జైల్లో వేశారని అసెంబ్లీలో మాజీ మంత్రి హరీశ్ రావు ప్రస్తావించడం.. అనంతరం పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ముఖ్య నేతల మధ్య రాజకీయ వేడిని రాజేసింది. హరీశ్ వాఖ్యలపై కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ప్రెస్ మీట్ నిర్వహించి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేయగా మరుసటి రోజే ఎమ్మెల్యే కూడా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కాటపై ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలు, విమర్శల పర్వం అంతటితో ఆగక బుధవారం మరోసారి కాట శ్రీనివాస్ మీడియా సమావేశం నిర్వహించి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆరోపణలపై ఘాటుగానే స్పందించారు. హరీశ్ రావు గురించి మాట్లాడే స్థాయి శ్రీనివాస్ గౌడ్‌కు లేదని మాట్లాడిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి వాఖ్యలపై ఫైర్ అయిన కాట.. మీరంతా రాజకీయాల్లోకి రానప్పుడే తన కుటుంభం రాజకీయాలు చేసిందని, ఇందులో అనుమానం ఉంటే మాజీ సీఎం కేసీఆర్‌ను అడిగి తెలుసుకోవచ్చని ఘట్టిగానే స్పందించారు. భవిష్యత్‌లో అడ్డు తలుగుతానని ఆనాడు హరీశ్ రావు, మహిపాల్ రెడ్డి కలిసి తన సర్పంచ్ పదవిని పోగొట్టారని, పార్టీలో చేరకపోవడంతో ఎన్నో రకాల కేసులు పెట్టి టార్గెట్ చేశారని కాట మండిపడ్డారు. తాను, తన కుటుంభం ఆస్తులు అమ్ముకొని పేదలకు అండగా నిలబడ్డామని, తమ పేర్లపై కొన్ని కాలనీలో ఉన్నాయని పేర్కొన్నారు. నెలకు రెండు లక్షలు సంపాదించే ఎమ్మెల్యేకు వేల కోట్ల ఆస్తులు ఎక్కడి నుండి వచ్చాయని ఈ సందర్భంగా ప్రశ్నించారు. స్వలాభం కోసం పూటకో పార్టీ మారిన చరిత్ర నీదైతే కార్యకర్తలను కడుపులో పెట్టుకొని కాంగ్రెస్ జెండాను మోసిన చరిత్ర మాదని అన్నారు. ఇకపై ఎమ్మెల్యే ఆగడాలను ఉపేక్షించమని, అన్ని అక్రమాలను బయటకు తీసి ప్రజల ముందు పెడతామని హెచ్చరించారు.

**తడి బట్టలతో గుడిలోకి రావాలని సవాల్ :**

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తనపై చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నట్లయితే తడి బట్టలతో, పసుపు బట్టలతో గుడిలోకి రావాలని కాట శ్రీను సవాల్ విసిరారు. ఉదయం 11 గంటలకు భీరంగూడ గుట్టపై శివాలయంలోకి వచ్చి తన నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. తాను చేసిన ఆరోపణలకు కూడా కట్టుబడి ఉన్నానని తాను కూడా తడి బట్టలతో వస్తానని చెప్పారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి, సర్పంచ్ స్థానాలకు అమ్ముకున్నానని, మంత్రి కూతురు పెళ్లికి డబ్బులు వసూలు చేశానని ఎమ్మెల్యే మాట్లాడిన మాటలు విడ్డూరంగా ఉన్నాయని, చేసిన ఆరోపణలు నిజమైతే గుళ్లోకి వచ్చి ప్రమాణం చేయాలన్నారు. ఇద్దరి ఆస్తులు బయటకు తీద్దామని ఎవరు అక్రమ మార్గంలో సంపాదించారో తెలుస్తుందని



అన్నారు. గెలిచిన మూడు సార్లు వెన్నుపోటుతోనే గెలిచిన చరిత్ర మహిపాల్ రెడ్డిదని, పది రోజుల ముందు నాకు బీ ఫామ్ దక్కుంటే నువ్వు గెలిచే వాడివా అని ప్రశ్నించారు. పోచారం గ్రామంలోని సర్వే నంబర్ 62 లో చేసిన భూస్కాం ఆధారాలన్నీ తన దగ్గరని ఉన్నాయని, ఇంద్రేశం, రామేశ్వరంబండ గ్రామాల సరిహద్దులో అమ్మకానికి పెట్టిన జాగ ఎక్కడిదని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సోదరుడి పేరుపై లక్ష గజాల ప్లాట్ ఉండటం నిజం కాదా అని, ఈడీ అటాచ్‌లో వందల కోట్ల ప్రాపర్టీలు దొరకలేదా అని ప్రశ్నించారు. హెచ్ఎండీఏ రోడ్లను, పార్కు స్థలాలను సైతం ఆక్రమించారని ఆరోపించారు. దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డి చనిపోయిన తరువాత లీజు పర్మిషన్ ఇచ్చాడని పూటకో మాట ఎమ్మెల్యే మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యే బెదిరింపులు బయపడేవారు ఎవరూ లేరని, ఆయన అక్రమాలపై తమ ఉద్యమం ఆగదని ఈ సందర్భంగా కాట శ్రీను హెచ్చరించారు.

# మీసేవ వినియోగ ఛార్జీలు 50% పెంపు




ఈ కబురు, హైదరాబాద్:

రాష్ట్ర ప్రభుత్వం మీసేవ కేంద్రాల ద్వారా అందించే పౌర సేవలపై వినియోగ ఛార్జీలు 50 శాతం పెంచింది. తక్షణమే పెంచిన ఛార్జీలను (ఏప్రిల్ 1, బుధవారం) అమల్లోకి తీసుకువచ్చింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం అందించే పౌర సేవలపై 18 శాతం జీఎస్టీ విధించనుంది. కేటగిరీఏలో రూ.35 నుంచి రూ.62కి, కేటగిరీబీలో రూ.45 నుంచి రూ.80కి పెంచింది. వాస్తవానికి 50 శాతం ఛార్జీలు పెంచినప్పటికీ.. జీఎస్టీ భారంతో కలిపి ఈ ఛార్జీల పెంపు 7778 శాతం వరకు ఉన్నాయి. దీంతో పౌర సేవల కోసం దరఖాస్తు చేసే ప్రజలు, విద్యార్థులపై ఆర్థిక భారం పడనుంది. మరోవైపు మీసేవ నిర్వాహకులకు వచ్చే కమీషన్ దాదాపు 15 ఏళ్ల తరువాత గణనీయంగా పెరిగింది. మీసేవ ద్వారా అందించే పౌర సేవల్లో కేటగిరీఏలో అదనపు డాక్యుమెంట్లు, సంబంధిత విభాగం పరిశీలన అవసరం లేకుండా సేవలు అందుతాయి. కేటగిరీబీలో సంబంధిత విభాగం విచారణ, పరిశీలన అనంతరం అందించే సేవలు వస్తాయి. గతంలో కేవలం వినియోగ ఛార్జీలు చెల్లించి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉండేది. దరఖాస్తుకు అదనంగా నాలుగుకు మించి పత్రాలు స్కాన్ చేయాలన్నా.. ప్రింట్ తీసుకోవాలన్నా పేజీకి రూ.2 చొప్పున చెల్లించాలి. కానీ తాజాగా వినియోగ ఛార్జీలతో పాటు నాలుగు పేజీల తరువాత ఒక్కో పేజీకి రూ.2.5 చొప్పున ఫీజు ఖరారు చేసింది. ఉదాహరణకు కొత్తగా కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసే వ్యక్తి గతంలో రూ.45 చెల్లిస్తే సరిపోయేది. ఇప్పుడు పెంచిన 50% ఛార్జీతో కలిపి రూ.67.5, దీనికి అదనంగా జీఎస్టీ 18% కలిపి రూ.79.65 (రౌండ్ ఫిగర్ రూ.80) చెల్లించాలి. అంటే ఒక్కో పత్రం కోసం దరఖాస్తు ఫీజు భారం రూ.35గా ఉంది.

--భారీగా కమిషన్ పెంపు..

మీసేవ నిర్వాహకులకు చెల్లించే కమీషన్ భారీగా పెరిగింది. గతంలో కేటగిరీఏ సేవలు అందించినప్పుడు చెల్లించిన రూ.35 ఫీజుపై రూ.13 కమీషన్‌గా ఉండేది. ఇప్పుడు రూ.62కి పెంచడంతో కమీషన్ రూ.40.34కి చేరింది. అలాగే కేటగిరీబీ సేవలపై ప్రస్తుతం రూ.80 వసూలు చేస్తున్నందున వారికి ఇచ్చే కమీషన్ రూ.52.10కి పెరిగింది. కొన్ని పౌర సేవలకు సంబంధిత ప్రభుత్వ విభాగానికి వాటా ఉంటుంది. కేటగిరీఏ, బీ సేవల్లో ఈ మొత్తం రూ.7గా ఉంది. అయితే కొన్ని సేవలకు ప్రభుత్వ వాటా ఉండదు. అలాంటి సేవల్లో ప్రభుత్వ వాటా రూ.7 నుంచి 30 శాతం ఈసేవ కమిషనరేట్‌కు.. 70 శాతం మీసేవ నిర్వాహకులకు అందుతుంది. ఉపకార వేతనాల (ఈపాస్) దరఖాస్తు సమయంలో విద్యార్థి ఆధార్ ధ్రువీకరణకు ఇప్పటివరకు రూ.20 వసూలు చేసేవారు. ఇక నుంచి ఆ మొత్తాన్ని ప్రభుత్వం రూ.35కి పెంచింది. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కన్నా అదనంగా వసూలు చేస్తే 1100 లేదా 18004251110 నంబర్లలో లేదా meesevasupport@telangana.gov.in చిరునామాకు ఈమెయిల్ చేయాలని సిటిజన్ ఛార్టర్‌లో ప్రభుత్వం తెలిపింది.

# నారేడ్కో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రేమ్ కుమార్ ఎన్నిక

ఈకబురు, శేరిలింగంపల్లి : నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్ ( నారేడ్కో) తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శేరిలింగంపల్లికి చెందిన ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ప్రేమ కుమార్ ను తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటూ బుధవారం నారేడ్కో కమిటీ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో కీలక పాత్ర పోషిస్తూ, డెవలపర్లకు ప్రభుత్వనికి మధ్య వారధిగా పనిచేస్తూన్న ప్రేమ్ కుమార్ ను నారేడ్కో ఉపాధ్యక్షుడుగా ఎన్నుకోవడం పై పలువురు రియల్ ఎస్టేట్ ప్రముఖులు, నిర్మాణ రంగ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నారేడ్కో తెలంగాణ నూతన ఉపాధ్యక్షుడు ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ తనకు నమ్మకంతో నారేడ్కో ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నిర్మాణ రంగాన్ని పరుగులు పెట్టించేందుకు తీసుకోవాలసిన చర్యలపై రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తానని అన్నారు. నిర్మాణ రంగంలో దశాబ్దాలుగా తాను చేస్తున్న సేవలకు గుర్తింపుగా తనకు ఈ పదవి వరించిందని తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగంలో కస్టమర్ల అభిరుచిని తెలుసుకొని ముందుకు సాగడం... వారి నమ్మకాన్ని పొందడం ముఖ్యమని తెలిపారు. దీంతోపాటు నాణ్యతతో కూడిన పనులు చేపట్టడం, కస్టమర్లకు ఇచ్చిన మాట ప్రకారం అనుకున్న సమయానికి ప్రాజెక్టును పూర్తి చేయడం ఎంతో కీలకమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కాగా నారేడ్కో తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రేమ్ కుమార్ ఎన్నికపై శేరిలింగంపల్లి బిల్డర్లు, నిర్మాణ రంగంలో ఉన్న ప్రముఖులు, ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.



ప్రేమ్ కుమార్

# గ్రూప్ –1 తరహాలో డిగ్రీ లెక్చరర్ పోస్టుల్లో అక్రమాలకు కుట్ర



ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిగ్రీ లెక్చరర్ల పోస్టుల నియామకాల్లో కుట్ర జరుగుతోందని చెప్పారు. గ్రూప్1 లో తాము అనుకున్న వారికే ఉద్యోగాలు ఇచ్చేలా ప్రత్యేక ఎగ్జామినేషన్ సెంటర్ పెట్టి కుట్ర చేశారని గుర్తు చేశారు. సరిగ్గా అదే విధంగా డిగ్రీ లెక్చరర్ల భర్తీ విషయంలోనూ ప్రయత్నం చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే జీవో నంబర్ 4 తో పాటు పీహెచ్డీ చేసిన వారికి 25 మార్కుల వెయిటేజీ, ఇంటర్వ్యూకి పది మార్కులంటూ నిబంధనలు తమ వారికి అనుకూలంగా మార్చుకుంటున్నారని విమర్శించారు. అసలు పీహెచ్డీ అడ్మిషన్లే లేకుండా 25 మార్కుల వెయిటేజీ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. స్టేట్ ఎలిజిబుల్ టెస్ట్ మూడేళ్లుగా నిర్వహించకపోవటంతో ఎంతో మందికి అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే జీవో నంబర్ 4 ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

--అడ్డంకిగా ఉన్న జీవో లను రద్దు చేయాలి

డీఎస్సీ కి జీవో నంబర్ 104, గ్రూప్స్ కు జీవో నంబర్ 29, పోలీసు ఉద్యోగాలకు జీవో నంబర్ 46, గురుకులాలకు జీవో నంబర్ 81, ఆడబిడ్డలకు రిజర్వేషన్లు రాకుండా జీవో నంబర్ 4 ను తెచ్చారని కవిత చెప్పారు. గత ప్రభుత్వం గానీ ఈ ప్రభుత్వం గానీ ఈ జీవోలను కనీసం సమీక్షించలేదని విమర్శించారు. దాదాపు 40 లక్షల కుటుంబాల్లో విద్యార్థులు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతుంటే...ప్రభుత్వం మాత్రం వారికి న్యాయం చేసే విషయంలో చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇంత మంది కన్నీటి గాథలు ఇలా ఉంటే...సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు ఆటలు ఆడుతుండటం సిగ్గుచేటన్నారు. మూసీ కి 7 వేల కోట్లు కేటాయిస్తూ రివ్యూ చేసే సమయం ఉన్న ప్రభుత్వానికి నిరుద్యోగులకు శాపంగా మారిన జీవో లపై సమీక్ష చేసే సమయం లేదా అని కవిత ప్రశ్నించారు. తెలంగాణ యువతను కాంగ్రెస్ పార్టీ రాజకీయ లబ్ధికోసం వాడుకుందన్నారు. రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి లు చెబితే నమ్మరని రాహుల్ గాంధీతోనే నిరుద్యోగులకు హామీ ఇప్పించారని గుర్తుచేశారు. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఎప్పుడిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు, అంగన్ వాడీ జీతాలు, గర్భిణులకు ఇచ్చే డబ్బులు, కిట్ లు కూడా ఆపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నిరుద్యోగుల సమస్య పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగుల వద్దకు వెళ్లి...ప్రభుత్వంపై పోరాటానికి వారిని సన్నద్ధం చేస్తామని హెచ్చరించారు.

-రేషన్ కార్డులు ఏరి వేసే పైశాచికం మానేయాలి

రేషన్ కార్డుల విషయంలో పేదలకు అన్యాయం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కవిత ఆరోపించారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆరోపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు రేషన్ కార్డుల ఏరివేత కార్యక్రమం పెట్టుకుందన్నారు. 5 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెబుతున్న ప్రభుత్వం ఏరివేత కార్యక్రమం ద్వారా 15 లక్షల రేషన్ కార్డులు తీసేయాలని చూస్తోందన్నారు. ఐటీ రిటర్న్ దాఖలు చేశారని, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారనే కారణంతో రేషన్ కార్డులు ఏరివేసే కుట్ర చేస్తున్నారని చెప్పారు. పేద ప్రజలకు మేలు చేసే రేషన్ కార్డుల విషయంలో పైశాచిక పనులను మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

--కొండగట్టు పనుల్లో ఇంత నిర్లక్ష్యమా!

కొండగట్టు అంజన్న ఆలయంలో చలువ పందిళ్లు కూలి 15 మంది గాయపడిన ఘటనపై కవిత విచారం వ్యక్తం చేశారు. హనుమాన్ చిన జయంతి వేడుకల కోసం నాసిరకంగా పందిళ్లు వేయడంతోనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే కొండగట్టు అంజన్న ఆలయంలో ఉత్సవాల సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడిన భక్తులకు మెరుగైన వైద్య చికిత్స అందించటంతో పాటు ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# అదనపు కట్నం కోసం వేధింపులు..

## మియాపూర్ లో నవవధువు ఆత్మహత్య



ఇషిక యాదవ్(ఫైల్)


**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** సోషల్ మీడియా పరిచయం ప్రేమగా మారి... పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్న జంట మధ్యలో అదనకు కట్నం చిచ్చు పెట్టింది. అదనపు కట్నం కోసం భర్త వేధింపులు తాళలేక మియాపూర్ లో ఓ నవవధువు ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఉన్నత చదువులు చదివి, బీహార్ నుంచి నగరానికి వచ్చి సాఫ్ట్వేర్ ఉద్యోగిగా పనిచేస్తూ... ప్రేమించిన యువకుడిని పెళ్లి చేసుకున్న యువతి భర్త వేధింపులతో అర్ధాంతరంగా తనువు చాలించింది. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటన కు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

బీహార్ రాష్టానికి చెందిన ఇషికయాదవప్ కు మధ్యప్రదేశ్ రాష్టానికి చెందిన నీరజ్ బన్సల్ తో 2020 సంవత్సరంలో ఫేస్‌బుక్‌లో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ప్రేమగా మారడంతో ఇద్దరూ కలిసి పెద్దలను ఒప్పించి 2026 ఫిబ్రవరి నెల 20వ తేదిన వివాహం చేసుకున్నారు. వివాహం అనంతరం భార్యభర్తలు మియాపూర్ మక్త మహబూబ్‌పేట్‌లోని ఓఅపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటూ హైటెక్‌సిటీలో ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పని చేస్తున్నారు. వీరికి పెళ్లి జరిగి 40 రోజులే ఆవుతుండగా భర్త నీరజ్ బన్సల్ కొన్నిరోజులుగా అదనపు కట్నం తీసుకురావాలంటూ భార్య ఇషిక యాదవ్‌ను వేధించడం మొదలుపెట్టాడు. ఈ వేధింపులు భరించలేక ఇషిక మంగళవారం రాత్రి తన నివాసంలోనే హాల్‌లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. బుధవారం ఉదయం నీరజ్ నిద్రలేచి చూడగా హాల్ లో ఇషిక ఉరివేసుకొని కనిపించింది. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టడంతో పాటు భర్తను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# జాబిల్లి దిశగా.. నింగిలోకి దూసుకెళ్లిన 'ఆర్టెమిస్2' రాకెట్

ఈ కబురు : అంతరిక్ష ప్రయోగంలో మరో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. చంద్రుడి వద్దకు మానవులను పంపేందుకు ఉద్దేశించిన 'ఆర్టెమిస్2'ను అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) తాజాగా ప్రయోగించింది. నలుగురు వ్యోమగాములతో కూడిన 'ఓరియన్' రాకెట్.. ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి జాబిల్లి దిశగా నింగిలోకి దూసుకెళ్లింది. ఈ రాకెట్ చంద్రుడి ఉపరితలానికి అత్యంత సమీపంగా వెళ్లి, దాన్ని చుట్టి రానుంది. ఈ మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములు పది రోజులపాటు రాకెట్‌లోనే ప్రయాణించనున్నారు. ఈ యాత్ర అనంతరం వ్యోమగాములు పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండ్ అయ్యేలా నాసా ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ ప్రయోగం విజయవంతమైతే భవిష్యత్తులో చందమామపైకి మానవులను పంపించే మార్గం సుగమం అవుతుంది. చంద్రుడి వద్దకు తొలిసారిగా ఓ మహిళ, ఓ నల్లజాతీయుడు, ఓ కెనడియన్ వెళ్తుండటం విశేషం.






## ఆంథ్రోపిక్ సోర్స్ కోడ్ లీక్.. స్పందించిన కంపెనీ

అమెరికాకు చెందిన ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ ఆంథ్రోపిక్‌కు చెందిన సోర్సు కోడ్ ఆన్‌లైన్‌లో లీకవ్వడం చర్చనీయాంశమైంది. ఆంథ్రోపిక్ తన 'క్లాడ్ కోడ్' ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ కోడ్‌ను ఎన్‌పీఎం రిజిస్ట్రీలో ఉంచగా.. అది అనూహ్యంగా బహిర్గతం అయ్యింది. అందులో క్లాడ్ కోడ్ ఎలా పనిచేస్తుంది? దాని ఆర్కిటెక్చర్ ఏంటి వంటి వివరాలు అందులో ఉన్నాయి. లీక్‌ను ఆంథ్రోపిక్ కూడా ధ్రువీకరించింది. మానవ తప్పిదం వల్ల జరిగిందంటూ పేర్కొంది.ఆంథ్రోపిక్ సంస్థ తాము భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తామంటూ చెప్పుకుంటూ ఉంటుంది. అలాంటి సంస్థ తన సొంత సోర్సు కోడ్‌ను కాపాడుకోకపోవడాన్ని సైబర్ నిపుణులు తప్పుబడుతున్నారు. అంతేకాదు ఏఐ వల్ల నష్టం పొంచి ఉందని, దానిపై నియంత్రణ అవసరమంటూ పలుమార్లు ఆంథ్రోపిక్ చెప్పుకొచ్చింది. అయితే, ఏఐ ఎంత ప్రమాదకరమోనంటూ ప్రపంచానికి నీతులు చెప్పే చెప్పే సంస్థకే ఈ పరిస్థితి ఎదురవడంపై నెటిజన్లు ట్రోల్స్ చేస్తున్నారు.సోర్సు కోడ్ లీక్‌పై విమర్శలే కాదు.. ఆంథ్రోపిక్‌కు ఓ విధంగా దెబ్బనే చెప్పాలి. ముఖ్యంగా 380 బిలియన్ డాలర్ల ఐపీఓకు ఆంథ్రోపిక్ సన్నాహాలు చేసుకుంటున్న వేళ ఈ లీక్ జరగడం ఆ సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించే అంశమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. లీక్ అంశం కేవలం మానవ తప్పిదం వల్ల జరిగిన పొరపాటని ఆంథ్రోపిక్ వివరణ ఇచ్చింది. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపింది. వినియోగదారుల డేటా గానీ, మెయిన్ AI మోడల్స్ గానీ లీక్ అవ్వలేదని స్పష్టతనిచ్చింది.

## డిజిటల్ లావాదేవీలు మరింత భద్రం .. ఇకపై 2ఫ్యాక్టర్ అథంటికేషన్



దిల్లీ: డిజిటల్ లావాదేవీలు మరింత భద్రం కానున్నాయి. మోసాలను అరికట్టేందుకు ఆర్‌బీఐ మార్గదర్శకాలు అనుసరించి నేటి నుంచి (ఏప్రిల్ 1 నుంచి) అన్ని డిజిటల్ లావాదేవీలకు 2ఫ్యాక్టర్ అథంటికేషన్ అందుబాటులోకి వచ్చింది. యూపీఐ సహా నెట్ బ్యాంకింగ్, వాలెట్లకు ఈ నిబంధన వర్తిస్తుంది. అంటే ఇకపై లావాదేవీ పూర్తి చేయాలంటే రెండు వెరిఫికేషన్ అంచెలను పూర్తి చేయాల్సి ఉంటుందన్నమాట. దీనివల్ల ఎవరైనా మీ పిన్ తెలుసుకున్నా మీకు తెలీకుండా అనధికారికంగా లావాదేవీ పూర్తి చేయడం సాధ్యం కాదన్నమాట. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం.. 2026 ఏప్రిల్ 1 నుంచి చేసే అన్ని లావాదేవీలూ టు ఫ్యాక్టర్ అథంటికేషన్‌కు లోబడి జరగాలి. యూపీఐ లావాదేవీ పూర్తి చేయాలంటే కేవలం యూపీఐ పిన్ ఎంటర్ చేస్తే సరిపోదు. ఆ లావాదేవీ పూర్తి కావాలంటే అదనంగా మరో వెరిఫికేషన్ యాడ్ చేయాలి. అది ఓటీపీ, ఫింగర్‌ప్రింట్, లేదా ఫేసియల్ రికగ్నిషన్‌లో ఏదో ఒకటి అయ్యుండాలి. అదనపు వెరిఫికేషన్ స్టెప్ ఉండటం వల్ల లావాదేవీ పూర్తి కావడానికి కొన్ని సెకన్ల సమయం ఎక్కువ పట్టొచ్చు. దీంతో పాటు భద్రత దృష్ట్యా బ్యాంకింగ్ యాప్స్‌లో స్క్రీన్ షాట్లు తీయడం లేదా స్క్రీన్ రికార్డింగ్ చేయడం పైనా పూర్తి నిషేధం విధించారు.

## ఇండిగో బాదుడు షురూ.. టికెట్‌పై గరిష్ఠంగా ₹10వేలు!

దిల్లీ: విమానాల్లో వినియోగించే ఇంధన ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో కీలక నిర్ణయం తీసుకుంది. టికెట్లపై వసూలు చేస్తున్న ఫ్యూయల్ ఛార్జీలను భారీగా పెంచేసింది. దేశీయ, అంతర్జాతీయ విమాన టికెట్లపై కనిష్ఠంగా రూ.275 నుంచి గరిష్ఠంగా రూ.10వేల వరకు వసూలు చేయనుంది. సవరించిన ఛార్జీలను ఏప్రిల్ 2 నుంచే వసూలు చేస్తామని ఇండిగో ఓ ప్రకటనలో తెలిపింది. ఈ కారణంగా దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణ ఛార్జీలు భారీగా పెరిగి ప్రయాణికులపై భారం పడనుంది.ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ATF) ధరలు సవరించిన రోజునే ఇండిగో నుంచి ప్రకటన వెలువడడం గమనార్హం. “గత నెల రోజుల్లో ఏటీఎఫ్ ధరలు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగాయి. దీనివల్ల విమానయాన సంస్థ నిర్వహణ వ్యయాలపై ఇది గణనీయమైన ప్రభావాన్ని చూపుతోంది. ఇంధన ధరల పెరుగుదలను పూర్తిగా భర్తీ చేయడానికి విమాన ప్రయాణ ఛార్జీలను భారీగా సవరించాల్సి ఉంటుంది. ప్రయాణికులపై పడే ఆర్థిక భారాన్ని దృష్టిలో ఉంచుకుని స్వల్ప మొత్తంలో వినియోగదారులకు బదిలీ చేశాం. ఈ ఛార్జీలు ఏప్రిల్ 2వ తేదీ అర్ధరాత్రి 00:01 గంటల నుంచి అమల్లోకి వస్తాయి'' అని ఇండిగో పేర్కొంది.

**పెంపు ఎంత?**

పశ్చిమాసియాలో నెలకొన్న సంఘర్షణల కారణంగా ఇంధన ధరలు ఒక్కసారిగా పెరగడంతో మార్చి 14 నుంచే ఇండిగో దేశీయ అంతర్జాతీయ విమాన టికెట్లపై రూ.425 నుంచి రూ.2,300 వరకు ఇంధన ఛార్జీల పేరిట వసూలు చేస్తోంది. దీన్ని ఇండిగో సవరించింది. ఇకపై దేశీయ విమాన సర్వీసులకు ప్రయాణించే దూరాన్ని బట్టి రూ.275 నుంచి రూ.950 మధ్య వసూలు చేయనుంది. 5011000 కిలోమీటర్లకు రూ.400; 10011500 కిలోమీటర్లకు రూ.600; 15012000 కిలోమీటర్లకు రూ.800; 2000 కిలోమీటర్లు దాటితే రూ.950 చొప్పున వసూలు చేయనున్నారు.

అంతర్జాతీయ విమానాల విషయంలో ప్రయాణ దూరాన్ని బట్టి ఈ ఛార్జీలు రూ.900 నుంచి రూ.10 వేల వరకు ఉంటాయని ఇండిగో పేర్కొంది. భారత ఉపఖండంలో 500 కిలోమీటర్లు దాటితే రూ.2500; దక్షిణాసియా, చైనా, ఆఫ్రికాకు రూ.5 వేలు, మధ్యప్రాచ్యం రూ.35 వేలు; యూకే, యూరప్ వంటి దేశాలకు గరిష్ఠంగా రూ.10వేలు చొప్పున ఫ్యూయల్ ఛార్జీల కింద ఇండిగో వసూలు చేయనుంది.

# మళ్లీ పెరిగిన బంగారం, వెండి ధరలు



దిల్లీ: దేశీయంగా బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో తగ్గినట్లే తగ్గిన వీటి ధరలు మళ్లీ పెరిగాయి. అంతర్జాతీయ తాజా పరిణామాలే ఇందుకు కారణం. కిలో వెండి ఏకంగా రూ.9 వేలు పెరగ్గా.. 10 గ్రాముల మేలిమి పసిడి రూ.3500 పెరిగిందని ఆలిండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. సోమవారం కిలో వెండి ధర రూ.2.37 లక్షల వద్ద ముగిసింది. నేడు ఏకంగా (మహవీర్ జయంతి సందర్భంగా మంగళవారం సెలవు) రూ.9 వేలు పెరిగి రూ.2.46 లక్షలకు (పన్నులతో కలిపి) చేరింది. 99.9 శాతం స్వచ్ఛతతో కూడిన బంగారం ధర సైతం రూ.3500 పెరిగి రూ.1.55 లక్షలు (అన్ని పన్నులూ కలిపి) చేరింది. 22 క్యారెట్ల బంగారం రూ.1.51 లక్షలు పలుకుతోంది.

కారణం ఇదే..పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టొచ్చన్న సంకేతాలతో బంగారం, వెండి ధరలు పెరిగాయి. ఉద్రిక్తతలు తగ్గితే ఇంధన మౌలిక వనరులకు ఎలాంటి నష్టం ఉండదన్న భరోసాతో క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టాయి. ద్రవ్యోల్బణ భయాలు తగ్గడంతో పాటు సెంట్రల్ బ్యాంకులు సైతం వడ్డీ రేట్లు పెంచకపోవచ్చన్న అంచనాలూ నెలకొన్నాయి. ఈ కారణంగానే బంగారం, వెండికి కొత్తగా డిమాండ్ ఏర్పడిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌లో సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. ఇరాన్ పరిణామాలు భవిష్యత్ ధరలను మార్గ నిర్దేశం చేసే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ఏడాదిలో రూ.57వేలు!**

గడిచిన ఆర్థిక సంవత్సరంలో (202526) బంగారం ధర ఏకంగా 61 శాతం పెరిగింది. గతేడాది ఏప్రిల్ 1న 10 గ్రాముల బంగారం ధర రూ.94,150 ఉండగా.. ఏడాది కాలంలో ఏకంగా రూ.57,350 మేర పెరిగింది. మరోవైపు వెండి సైతం రూ.1.34 లక్షలు పెరిగింది. మదుపర్లకు 131 శాతం ప్రతిఫలాన్ని అందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ విపణిలో స్పాట్ గోల్డ్ ఔన్సు 4743 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి ఔన్సు 76 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## భారీ లాభాల్లో ముగిసిన స్టాక్‌మార్కెట్లు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 1187 పాయింట్లు లాభపడి 73,134కు చేరుకుంది. నిఫ్టీ 348 పాయింట్లు లాభపడి 22,679 వద్ద ట్రేడయింది. విదేశీ మార్కెట్ల సానుకూల సంకేతాలు, ముడి చమురు ధరలు తగ్గడం, ఇరాన్‌లో తమ సైనిక చర్యను అతి త్వరలోనే ముగిస్తామని ట్రంప్ నుంచి సానుకూల ప్రకటన వంటివి సూచీలకు కలిసొచ్చాయి.

నేటి ట్రేడింగ్ సెషన్‌లో ఉదయం సెన్సెక్స్ 1800కిపైగా పాయింట్ల లాభపడగా.. నిఫ్టీ 550కిపైగా పాయింట్లకు పైగా లాభాల్లో ట్రేడైంది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, ఇండిగో, అదానీ పోర్ట్స్ , బీఈఎల్, ఎస్‌బీఐ స్టాక్స్ ప్రధానంగా లాభపడ్డాయి. ఎన్టీపీసీ, సన్‌ఫార్మా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అల్ట్రాటెక్ సిమెంట్, భారతీ ఎయిర్‌టెల్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 103 డాలర్లు ఉండగా.. బంగారం ఔన్సు 4736 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## మార్చిలో ₹2 లక్షల కోట్లు దాటిన జీఎస్టీ వసూళ్లు

దిల్లీ: దేశంలో స్థూల వస్తు, సేవల పన్ను వసూళ్లు (GST Collections) భారీగా నమోదయ్యాయి. మార్చి నెలకు గానూ 8.8 శాతం వృద్ధితో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాలు పెరగడం, దిగుమతుల కారణంగా పన్ను వసూళ్లు ఈస్థాయిలో పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తోంది. గతేడాది మార్చిలో జీఎస్టీ వసూళ్లు రూ.1.83 లక్షలుగా నమోదయ్యాయి.

దేశీయంగా విక్రయాల ద్వారా 5.8 శాతం వృద్ధితో రూ.1.46 లక్షల కోట్ల మేర జీఎస్టీ ఆదాయం సమకూరగా.. దిగుమతుల రూపంలో 17.8 శాతం వృద్ధితో రూ.53,861 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి. రిఫండ్ల సర్దుబాటు అనంతరం నికరంగా జీఎస్టీ వసూళ్లు రూ.1.78 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది. 2025 26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి 8.3 శాతం వృద్ధితో జీఎస్టీ వసూళ్లు రూ.22.27 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది.

## రాణించిన ఓలా ఎలక్ట్రిక్.. విక్రయాల్లో భారీ వృద్ధి

ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ (Ola Electric) మళ్లీ పుంజుకొంది. మార్చి నెల చివరి వారంలో రోజుకు సగటున వెయ్యి యూనిట్లు విక్రయించినట్లు కంపెనీ తెలిపింది. మార్చి మొత్తానికి గానూ 10,117 రిజిస్ట్రేషన్లు పూర్తైనట్లు వాహన్ డేటా ప్రకారం తెలుస్తోంది. ఫిబ్రవరి నెలలో ఓలా ఎలక్ట్రిక్ రిజిస్ట్రేషన్ల సంఖ్య 3,973 యూనిట్లతో పోలిస్తే గత నెలలో 150 శాతం వృద్ధి నమోదు కావడం గమనార్హం.ఓలా సర్వీసు సెంటర్ల వద్ద తాత్సారం, విడిభాగాలు లభ్యం కాకపోవడం వంటి కారణాలతో ఓలా సేవల పట్ల వినియోగదారుల్లో అసంతృప్తి నెలకొన్న సంగతి తెలిసిందే. దీంతో మార్కెట్ వాటా పరంగా ఒకప్పుడు అగ్రస్థానంలో ఉన్న ఈ సంస్థ.. తన వాటాను కోల్పోతూ వచ్చింది. ఈ క్రమంలో సర్వీసు సెంటర్లను విస్తరించింది. పనితీరును మెరుగుపరిచింది. సర్వీసింగ్‌కు వచ్చే వాహనాల్లో దాదాపు 80 శాతం అదే రోజు పూర్తి చేసి ఇస్తున్నట్లు ఓలా పేర్కొంది. స్పేర్ పార్టుల లభ్యత పెంచినట్లు ఓలా తెలిపింది. ఓలా ఎలక్ట్రిక్ పట్ల కస్టమర్లలో పెరిగిన విశ్వాసం కారణంగా మార్చి నెల విక్రయాల్లో భారీ వృద్ధి నమోదైందని కంపెనీ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. మొత్తంగా 1 మిలియన్ విక్రయాలు సాధించిన తొలి ఈవీ కంపెనీగా నిలిచినట్లు పేర్కొన్నారు. ఇదే పనితీరును భవిష్యత్‌లోనూ కొనసాగిస్తామన్న ఆశాభావం వ్యక్తంచేశారు.



## ముంబై బంగ్లాను లీజుకిచ్చిన సారా.. ఐదేళ్లకు రూ. 4 కోట్లకు పైగా డీల్



బాలీవుడ్ యువ నటి సారా అలీ ఖాన్ ముంబైలోని తన ఆస్తిని లీజుకు ఇచ్చి భారీ ఆదాయం పొందనున్న సెలబ్రిటీల జాబితాలో చేరారు. అంధేరీ వెస్ట్‌లోని తన బంగ్లాను ఐదేళ్ల కాలానికి గాను రూ. 4.14 కోట్లకు ఒక ప్రైవేట్ సంస్థకు లీజుకు ఇచ్చారు. ప్రోడిజీ మాంటిస్సోరి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ ఈ ప్రాంగణాన్ని పాఠశాల కార్యకలాపాల కోసం ఉపయోగించుకోనుంది.

ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ పత్రాల ప్రకారం, ఈ ఒప్పందం వివరాలు ఆసక్తికరంగా ఉన్నాయి. లీజు కాలం మే 1, 2026 నుంచి ప్రారంభమవుతుంది. మొదటి రెండేళ్ల పాటు నెలవారీ అద్దె రూ. 6.5 లక్షలుగా నిర్ణయించారు. మూడో ఏడాది నుంచి అద్దెపై 5 శాతం పెరుగుదల ఉంటుంది. దీని ప్రకారం, మూడో సంవత్సరంలో అద్దె రూ. 6.82 లక్షలకు, ఐదో సంవత్సరానికి రూ. 7.52 లక్షలకు చేరుకుంటుంది. ఈ ఒప్పందంలో భాగంగా అద్దెకు తీసుకున్న సంస్థ రూ. 20 లక్షల సెక్యూరిటీ డిపాజిట్‌ను చెల్లించింది. ముంబైలోని ఓల్డ్ లోఖండ్‌వాలా కాంప్లెక్స్‌లో ఉన్న ఈ బంగ్లా సుమారు 4,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఈ ఒప్పందంలో 36 నెలల లాక్-ఇన్ పీరియడ్ కూడా ఉంది.

ఇటీవలి కాలంలో బాలీవుడ్ ప్రముఖులు తమ కమర్షియల్ ప్రాపర్టీలను లీజుకు ఇవ్వడం లేదా కొనుగోలు చేయడం ఒక ట్రెండ్‌గా మారింది. కొన్ని రోజుల క్రితం మాధురీ దీక్షిత్, రాకేష్ రోషన్ కూడా తమ ఆస్తులను లీజుకు ఇవ్వగా, నటుడు బాబీ డియోల్ రూ. 15 కోట్లతో ఆఫీస్ స్పేస్‌ను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే.



## రామాయణ.. రాముడి పాత్రను మొదట తిరస్కరించా: రణ్‌బీర్ కపూర్

రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నితీశ్ తివారీ దర్శకత్వంలో రానున్న చిత్రం 'రామాయణ' (Ramayana). ఇందులో రణ్‌బీర్ రాముడిగా కనిపించనున్నారు. ఆయన ఈ పాత్ర గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. చిత్రబృందం తనను సంప్రదించినప్పుడు మొదట తిరస్కరించినట్లు తెలిపారు. కుమార్తె రాహా కోసమే ఈ పాత్రను అంగీకరించినట్లు చెప్పారు. "సుమారు నాలుగేళ్ల క్రితం నిర్మాత నమిత్ మల్హోత్రా నాకు ఈ పాత్రను ఆఫర్ చేసినప్పుడు, వెంటనే 'నో' చెప్పాను. ఆ పాత్రకు న్యాయం చేసేంత సామర్థ్యం నాకు లేదని, నేను దానికి తగినవాడిని కాదని అనుకున్నా. కానీ, రాహా నా ఆలోచన విధానాన్ని మార్చేసింది. ఇలాంటి అవకాశాలు చాలా తక్కువమందికి వస్తాయి. భయం వదిలిపెట్టి ధైర్యంగా ముందడుగు వేయాలి అనుకున్నా. అందుకే అంగీకరించా" అని రణ్‌బీర్ (Ranbir Kapoor) చెప్పారు. ఒక తండ్రిగా తన బాధ్యతలను తెలుసుకున్న తర్వాత, శ్రీరాముడి వంటి ఆదర్శవంతమైన పాత్రను పోషించడం తన వ్యక్తిగత ఎదుగుదలకు కూడా సహాయపడుతుందని భావించినట్లు తెలిపారు. భారీ బడ్జెట్‌తో, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్‌తో 'రామాయణ' రూపొందుతోంది. మొదటిభాగం దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇందులో సీతగా సాయిపల్లవి కనిపించనున్నారు.

# నాగార్జున చిత్రంలో ఐశ్వర్య రాజేశ్?



'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో తెలుగులో ఘన విజయాన్ని అందుకున్న ఐశ్వర్య రాజేశ్ మరొక సీనియర్ హీరో నాగార్జునతో జట్టు కట్టనుందా? ఆ అవకాశమైతే ఉందనే చెబుతున్నాయి తెలుగు సినీ వర్గాలు. అధికారికంగా ఇంకా ధ్రువీకరణ అయితే కాలేదు కానీ, చిత్రబృందం అయితే ఆమెని సంప్రదించినట్టు సమాచారం. తన వందో చిత్రం కోసం నాగార్జున తమిళ దర్శకుడు రా.కార్తీక్‌తో కలిసి పనిచేస్తున్న సంగతి తెలిసిందే. 'కింగ్ 100' పేరుతో పట్టాలెక్కిన ఈ సినిమాలో ముగ్గురు కథానాయికలకు చోటున్నట్టు సమాచారం. సుస్మితభట్, సీనియర్ హీరోయిన్ టబు ఇప్పటికే ఈ సినిమా కోసం రంగంలోకి దిగినట్టు సమాచారం. తాజాగా ఐశ్వర్యరాజేశ్ పేరూ వినిపిస్తోంది. త్వరలోనే ఈ విషయంపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ చిత్రాన్ని నాగార్జున స్వయంగా నిర్మిస్తున్నారు.

## ఎన్టీఆర్ 'డ్రాగన్'.. అందుకే మౌనంగా ఉంటా: టొవినో థామస్



ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' రూపొందుతోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రంలో తాను భాగం కాదని మలయాళ నటుడు టొవినో థామస్ మంగళవారం స్పష్టత నిచ్చిన విషయం తెలిసిందే. తన కామెంట్స్‌ను ఉద్దేశించి సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారంపై తాజాగా ఆయన స్పందించారు. తన వ్యాఖ్యలను పలువురు తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపారు. ఇలాంటివి జరుగుతాయని ఊహించే కొన్ని విషయాలపై మాట్లాడటానికి ఆసక్తి చూపించనన్నారు.

"నిన్న ఓ ప్రెస్‌మీట్‌లో ఈ విషయం గురించి మాట్లాడాను. కాకపోతే నా మాటలను కొంతమంది తప్పుగా అర్థం చేసుకున్నారు. 'డ్రాగన్'లో యాక్ట్ చేయడం నాకు అసలు ఇష్టం లేదన్నట్లు భావిస్తున్నారు. కానీ, అది నిజం కాదు. ఇలాంటి సమస్యలు వస్తాయి కాబట్టే కొన్ని సందర్భాల్లో మౌనంగా ఉంటా. ఒకే సమయంలో వేర్వేరు పనులు చేయలేను. ఇదొక విభిన్నమైన వర్కింగ్ స్టైల్. దీనినే ఎంతో కాలం నుంచి ఫాలో అవుతున్నా. దీనిని సరిగ్గా అర్థం చేసుకోలేకపోయారు" అని తెలిపారు. తనకు ప్రశాంత్ నీల్ అంటే ఎంతో ఇష్టమన్నారు. ఆయన వర్కింగ్ స్టైల్‌ను తానెంతో ఇష్టపడుతున్నానని చెప్పారు. "నాకు సినిమాల్లో నటించడం చాలా ఇష్టం. డబ్బు లేదా స్టార్‌డమ్ కంటే మూవీ మేకింగ్ ప్రాసెస్‌ను నేనెంతో ఎంజాయ్ చేస్తుంటా" అని ఆయన అన్నారు. తాను భాగం కాకపోయినప్పటికీ 'డ్రాగన్' భారీ విజయాన్ని అందుకోవాలని కోరారు.

'మిన్నల్ మురళి', '2018', 'ఎ.ఆర్.ఎమ్' వంటి చిత్రాలతో టొవినో థామస్ తెలుగు వారికి సుపరిచితులయ్యారు. ఆయన నటించిన కొత్త చిత్రం 'పళ్లి చట్టంబి' విడుదలకు సిద్ధంగా ఉంది. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఏప్రిల్ 10న విడుదల కానుంది.

## రిలీజ్ డేట్‌పై గందరగోళం.. చరణ్ ఏమన్నాడంటే?



రామ్ చరణ్ కొత్త సినిమా 'పెద్ది' విడుదల తేదీపై ప్రస్తుతం గందరగోళం నెలకొంది. లెక్క ప్రకారం మార్చి 27న రావాలి. కానీ అనివార్య కారణాల వల్ల ఏప్రిల్ 30కి వాయిదా వేశారు. అయితే ఈ తేదీన కూడా రావట్లేదని చెప్పి కొన్నిరోజుల నుంచి ప్రచారం సాగుతోంది. రీసెంట్‌గా మరో మూవీ ఈవెంట్‌లో నిర్మాత ఎస్కేఎన్ కూడా జూన్ 26న 'పెద్ది' వస్తుందనేసరికి అభిమానులు కంగారుపడ్డారు. తర్వాత తనకు తెలియకుండానే చెప్పేశానని క్లారిటీ ఇచ్చినప్పటికీ అందరికీ విడుదల తేదీపై సందేహం అలానే ఉండిపోయింది.

సోషల్ మీడియాలో వినిపిస్తున్న రూమర్స్ అన్నింటికీ ఇప్పుడు స్వయంగా రామ్ చరణ్ క్లారిటీ ఇచ్చేశారు. మెగా డాటర్ నిహారిక నిర్మించిన 'రాకాస' ప్రమోషన్ల సందర్భంగా టీమ్ అంతా వెళ్లి చరణ్‌ని కలిశారు. మాటల మధ్యలో 'పెద్ది' లేట్ అవ్వట్లేదని కొంచెం ప్రమోట్ చెయ్యండ్రా అని ఫన్నీగా చెబుతూనే క్లారిటీ ఇచ్చేశారు. చెప్పిన తేదీకి రావడం పక్కా అనే స్పష్టత వచ్చేసింది.

విడుదలకు మరో నెల కూడా లేదు. అయినా ఇప్పటికీ షూటింగ్ జరుగుతోంది. ఒకటి రెండు పాటలు పెండింగ్‌లో ఉన్నాయని టాక్. మరి షూటింగ్ పూర్తి చేసి, పాన్ ఇండియా మూవీ కాబట్టి అందుకు తగ్గట్లే ప్రమోషన్స్ చేసుకోవడానికి టైమ్ ఉంటుందా? లేదంటే చివరి నిమిషంలో మళ్లీ వాయిదా అని చెప్పి ఏమైనా షాకిస్తారా అనేది చూడాలి?

స్పోర్ట్స్ డ్రామాగా తీస్తున్న 'పెద్ది'లో రామ్ చరణ్, జాన్వీ కపూర్ హీరోహీరోయిన్లు. కన్నడ హీరో శివరాజ్ కుమార్ కీలక పాత్ర చేస్తున్నారు. జగపతిబాబు, దివ్యేందు కీలక పాత్రలు చేస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతమందించగా.. రిలీజ్ చేసిన రెండు పాటలు ఇప్పటికే హిట్ అయ్యాయి. బుచ్చిబాబు దర్శకుడు.

## విప్లవం నా మాతృభూమి కోసమే



'వెన్నుపోటు పొడవడం మీ నైజం.. మరాఠాలు ఈ సత్యాన్ని గ్రహించిన రోజు అది మీ అంతానికి నాంది అవుతుంది' అంటూ 'రాజా శివాజీ' సినిమా ఫస్ట్‌లుక్ టీజర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా ఆవిష్కరించింది చిత్రబృందం. బాలీవుడ్ హీరో రితేశ్ దేశ్‌ముఖ్ ప్రధాన పాత్రలో నటిస్తూ.. స్వయంగా తెరకెక్కిస్తున్న చిత్రమిది. జ్యోతి దేశ్‌పాండే, జెనీలియా దేశ్‌ముఖ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా విడుదలైన ఫస్ట్‌లుక్ టీజర్‌తో పాటు రితేశ్ ఇన్‌స్టాలో.. 'భారతీయ గొప్ప వీర చక్రవర్తి ఛత్రపతి శివాజీ మహారాజుకు నివాళి అర్పించాలన్న దశాబ్దపు స్వప్నం ఇది..' అని భావోద్వేగపరమైన క్యాప్షన్‌తో ఇక నుంచి ఈ సినిమా సందడి ప్రారంభం కానుందని పంచుకున్నారు. ఈ టీజర్.. 'ఇకపై మన భూమి మన జెండాను మాత్రమే ఎగురవేస్తుంది.. మేం కేవలం కాషాయాన్ని ఎగురవేయడమే కాదు ఒక విప్లవాన్ని రగిలించాం.. ఈ విప్లవం నా మాతృభూమి కోసమే' 'నువ్వు నా ఆలోచనల్ని ఆక్రమించుకున్నావని నేను అంగీకరిస్తున్నాను.. శివా నీ మనసులో ఏముంది?' 'స్వరాజ్యం' లాంటి ఆసక్తికరమైన సంభాషణలు నటీనటుల యాక్షన్ సన్నివేశాలతో ఆకట్టుకుంటోంది. ఇందులో సంజయ్‌దత్, జెనీలియా, అభిషేక్ బచ్చన్, విద్యా బాలన్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. మే 1న ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకుల ముందుకురానుంది.

# 'పవర్ మార్నింగ్'..

## సమంత ఫాలో అయ్యే ఫార్ములా ఇదే

నటి సమంత తాజాగా తన మార్నింగ్ రొటీన్‌ను అభిమానులతో పంచుకున్నారు. దీనిని 'పవర్ మార్నింగ్' అని పేర్కొన్నారు. ఇది తన జీవితాన్ని ఎంతగానో మార్చిందని చెప్పారు. "ఉదయం ప్రశాంతంగా మొదలైతే మిగిలిన రోజంతా ఉత్సాహంగా గడుస్తుందని నమ్ముతుంటా. ఇప్పటివరకూ ఎన్నో మార్నింగ్ రొటీన్స్‌ను ఫాలో అయ్యా. చివరకు ఒక సులభతరమైన ఫార్ములాకు అలవాటు పడ్డా. అది ఉపయోగపడింది. అదే నా పవర్ మార్నింగ్. నిద్రలేచే సమయానికి ఒత్తిడికి గురి చేసే హార్మోన్లు ఎక్కువ స్థాయిలో ఉంటాయి. ఇది ఎవరికైనా సాధారణం. కాబట్టి, నిద్ర లేచిన వెంటనే మనం ఏం చేస్తున్నామనేది ముఖ్యం. చాలామంది ఫోన్లు పట్టుకుంటారు. మెయిల్స్ చూడటం, వర్క్ గురించి ఆలోచిస్తారు. దీనివల్ల ఉదయాన్నే మరింత ఒత్తిడికి గురవుతారు" అని సమంత అన్నారు. అనంతరం ప్రశాంతమైన జీవనం కోసం ఫాలో అవుతున్న ఎనిమిది రూల్స్ గురించి తెలియజేశారు. నిద్ర లేచిన తర్వాత ఒక గంట పాటు ఫోన్ వాడకపోవడం, ఐదు నిమిషాలు ధ్యానం, సూర్యరశ్మి తగిలేలా కూర్చోవడం, గోరువెచ్చటి నీళ్లలో పసుపు, నిమ్మరసం కలిపి తాగడం, ఆరోగ్యకరమైన బ్రేక్‌ఫాస్ట్, 11 గంటలలోపే వర్కౌట్లు చేయాలన్నారు. ఆ రోజు ఏం సాధించాలనుకుంటున్నామనేది నిర్ణయించుకుని ఒక పుస్తకంలో రాసుకోవాలన్నారు. జీవితంలో మార్పు కావాలనుకునేవారు 21 రోజులపాటు దీనిని ఫాలో కావాలని చెప్పారు.





## తొలి మ్యాచ్‌లో ఫాస్టెస్ట్ బౌలర్ ఆడతాడా..? కోచ్ ఏమన్నాడంటే?

ఐపీఎల్ 2026 సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తన తొలి మ్యాచ్‌ను దిల్లీ క్యాపిటల్స్‌తో ఆడేందుకు సిద్ధమవుతోంది. ఈక్రమంలో అందరి దృష్టి ఫాస్ట్ బౌలర్ మయాంక్ యాదవ్ పైనే ఉంది. గాయం కారణంగా చాన్నాళ్లుగా క్రికెట్‌కు దూరమైన అతడు.. మళ్లీ ఐపీఎల్‌లో అడుగు పెట్టాడు. అయితే, మొదటి మ్యాచ్‌లో ఆడతాడా? లేదా? అనేది ఇంకా తెలియదు. దీనిపై లఖ్‌నవూ ప్రధాన కోచ్ జస్టిన్ లాంగర్ స్పందించాడు. మయాంక్‌తో పాటు మరో పేసర్ నమన్ తివారీ కూడా ఫిట్‌గా ఉన్నాడని వెల్లడించాడు. ''ఇద్దరు పేసర్లు మంచి ఫిట్‌నెస్‌తో ఉన్నారు. మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మంచి భవిష్యత్తు ఉన్న ప్లేయర్లు. ఇంతకుముందెప్పుడూ లేనివిధంగా ఈసారి టోర్నీలో మేం ఇద్దరు అద్భుతమైన యువ పేసర్లతో బరిలోకి దిగుతున్నాం. ఇప్పటికే మోసిన్ ఖాన్, షమీ, ఆకాశ్ సింగ్ ఉన్నారు. ఆనిచ్ నోకియా సేవలను మిస్ అవుతున్నాం. అయితే, అర్జున్ తెందూల్కర్ వంటి మరో యువ ఆల్‌రౌండర్ ఉన్నాడు. తుది జట్టులో ఎవరికి అవకాశం కల్పిస్తామనేది ఇప్పుడే చెప్పలేం. మ్యాచ్‌కు ముందు నిర్ణయం తీసుకుంటాం'' అని లాంగర్ తెలిపాడు.

**మావాళ్లు మంచి రిథమ్‌లో ఉన్నారు: దిల్లీ బౌలర్**

లఖ్‌నవూతో మ్యాచ్ కోసం తాము ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు దిల్లీ బౌలర్ దుష్మంత చమీర వెల్లడించాడు. తమ ఆటగాళ్లంతా మంచి రిథమ్‌లో ఉన్నారని పేర్కొన్నాడు. ''గత కొన్ని రోజులుగా సన్నద్ధత బాగా జరిగింది. రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌లు కూడా ఆడాం. ఎప్పుడెప్పుడు ప్రధాన మ్యాచ్ బరిలోకి దిగుదామా? అని ఎదురుచూస్తున్నాం. గత మూడు మ్యాచుల్లోనూ హోం టీమ్‌లే గెలిచిన సందర్భాలను చూశాం. లఖ్‌నవూ నుంచి గట్టి పోటీ ఉంటుందని భావిస్తున్నా. బౌలింగ్ యూనిట్ అంతా చర్చించుకొని పక్కా ప్రణాళికతో బరిలోకి దిగబోతున్నాం. మా ఓపెనర్లు ఐడెన్ మార్‌క్రమ్, మిచెల్ మార్ష్ మంచి ఫామ్‌లోనే ఉన్నారు'' అని చమీర వివరించాడు.

# లఖ్‌నవూపై ఢిల్లీ ఘనవిజయం

**6 వికెట్లతో లక్నోపై విజయం**
**సమీర్ రిజ్వీ అర్ధ సెంచరీ**

**ఐపీఎల్‌లో మరో మ్యాచ్ స్వల్ప స్కోర్లతో ఉత్కంఠభరితంగా ముగిసింది. లక్నో సూపర్ జెయింట్స్‌తో 142 పరుగుల లక్ష్య ఛేదనలో ఒకదశలో 26/4తో నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ చివరకు గట్టెక్కింది. యువ ఆటగాడు సమీర్ రిజ్వీ ముందుండి నడిపించగా, ట్రిస్టన్ స్టబ్స్ అతనికి అండగా నిలిచాడు. అంతకుముందు ఢిల్లీ బౌలర్ల ముందు నిలవలేక టాప్–5లో ముగ్గురు సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడంతో లక్నో ఇన్నింగ్స్ స్వల్ప స్కోరుకే ముగిసింది. ఈ సీజన్‌లో నాలుగు మ్యాచ్‌ల తర్వాత ఒక టీమ్‌కు 'హోం గ్రౌండ్'లో ఓటమి ఎదురైంది.**



లక్నో: అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్ ఐపీఎల్‌లో శుభారంభం చేసింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ 6 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లక్నో 18.4 ఓవర్లలో 141 పరుగులకే ఆలౌటైంది. అబ్దుల్ సమద్ (25 బంతుల్లో 36; 3 ఫోర్లు, 1 సిక్స్), మిచెల్ మార్ష్ (28 బంతుల్లో 35; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) మాత్రమే ఫర్వాలేదనిపించారు. ఢిల్లీ బౌలర్లలో ఎన్‌గిడి, నటరాజన్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం ఢిల్లీ 17.1 ఓవర్లలో 4 వికెట్లకు 145 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సమీర్ రిజ్వీ (47 బంతుల్లో 70 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీ సాధించగా, ట్రిస్టన్ స్టబ్స్ (32 బంతుల్లో 39 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) అండగా నిలిచాడు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 76 బంతుల్లో అభేద్యంగా 119 పరుగులు జోడించారు.

**టపటపా...**

మార్ష్ కొన్ని చక్కటి షాట్లతో ఇన్నింగ్స్‌ను మొదలు పెట్టినా... రిషభ్ పంత్ (7), మార్‌క్రమ్ (11) విఫలం కావడంతో పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 48/2కు చేరింది. ఆ తర్వాత బదోని (0), పూరన్ (8) కూడా విఫలమయ్యారు. కుల్దీప్ చక్కటి బంతితో మార్ష్‌ను బోల్తా కొట్టించడంతో సగం ఓవర్ల లోపే లక్నో సగం వికెట్లు చేజార్చుకుంది. 23 పరుగుల వ్యవధిలో జట్టు 4 వికెట్లు చేజార్చుకుంది. ముకుల్ (14) ప్రభావం చూపలేకపోగా, ఈ స్థితిలో సమద్ ఒక్కడే కాస్త పట్టుదలగా నిలబడి కొన్ని పరుగులు సాధించాడు. అయితే నటరాజన్ ఒకే ఓవర్లో సమద్, షమీ (1)లను అవుట్ చేయగా, ఎన్‌గిడి తర్వాతి ఓవర్లో వరుస బంతుల్లో రెండు వికెట్లు తీయడంతో మరో ఎనిమిది బంతులు మిగిలి ఉండగానే లక్నో ఇన్నింగ్స్ ముగిసింది.

**కీలక భాగస్వామ్యం...**

ఛేదనలో ఢిల్లీ తడబడింది. మొదటి బంతికే కేఎల్ రాహుల్ (0) వెనుదిరగ్గా... ఐదు పరుగుల వ్యవధిలో నితీశ్ రాణా (15), నిసాంక (1), అక్షర్ పటేల్ (0) అవుటయ్యారు. 4.3 ఓవర్లకే స్కోరు 26/4 కావడంతో క్యాపిటల్స్ కష్టాలు పెరిగాయి. అయితే రిజ్వీ, స్టబ్స్ పట్టుదలగా నిలబడి 17 బంతులు మిగిలి ఉండగానే ఢిల్లీని విజయతీరాలకు చేర్చారు. లక్నో ఏకంగా 16 వైడ్‌లు సహా 20 అదనపు పరుగులిచ్చి ప్రత్యర్థికి ఇతోధిక సహకారం అందించింది.

**రెండు సిక్సర్లతో మొదలు పెట్టి...**

2024 ఐపీఎల్‌లో రిజ్వీని చెన్నై సూపర్ కింగ్స్ ఏకంగా రూ.8.40 కోట్లకు ఎంచుకుంది. ఈ యూపీ ఆటగాడు దూకుడైన బ్యాటింగ్‌తో 'కుడిచేతి వాటం సురేశ్ రైనా'గా గుర్తింపు పొందాడు. ఐపీఎల్‌లో తాను ఆడిన తొలి 4 బంతుల్లో రెండు సిక్సర్లు బాది ఒక్కసారిగా అందరి దృష్టినీ ఆకర్షించినా... ఐదు ఇన్నింగ్స్‌లలో కలిపి 51 పరుగులే చేయగలిగాడు. దాంతో చెన్నై వదులుకోగా, గత సీజన్‌లో ఢిల్లీ రూ.95 లక్షలకు తీసుకుంది. చివరి మ్యాచ్‌లో 25 బంతుల్లో 58 పరుగులతో జట్టును గెలిపించగా... ఈసారి అదే మొత్తానికి ఫ్రాంచైజీ అతడిని తమతో కొనసాగించింది. ఎట్టకేలకు జట్టు కష్టాల్లో ఉన్న సమయంలో హీరోలా కీలకమైన హాఫ్ సెంచరీతో తన స్థాయిని పెంచుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌ను కూడా రిజ్వీ తడబడుతూనే ప్రారంభించాడు. తొలి 8 బంతుల్లో అతను సింగిల్ కూడా తీయలేకపోయాడు. తొలి 13 బంతుల్లో చేసినవి 5 పరుగులే! అయితే నోర్జే బౌలింగ్‌లో డీప్ థర్డ్‌మాన్ దిశగా కొట్టిన సిక్స్‌తో అతని జోరు మొదలైంది. షహబాజ్ ఓవర్లో 3 ఫోర్లు బాదిన తర్వాత పరిస్థితికి తగినట్లుగా ఆటను మార్చుకున్నాడు. మార్‌క్రమ్ ఓవర్లో 6, 4 కొట్టి 37 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. చివరి వరకు నిలబడి జట్టును గెలిపించాడు.

**షమీ తొలి బంతికే...**

ఐపీఎల్‌లో తొలిసారి లక్నో జట్టు తరఫున బరిలోకి దిగిన సీనియర్ పేసర్ షమీ వచ్చీ రాగానే ప్రభావం చూపించాడు. మొదటి బంతికే రాహుల్‌ను అతను అవుట్ చేశాడు. ఐపీఎల్‌లో ఇన్నింగ్స్ తొలి బంతికే షమీ వికెట్ తీయడం ఇది ఐదోసారి కావడం విశేషం. గతంలో ఏ బౌలర్ మూడుసార్లకు మించి ఈ ఫీట్‌ను

### స్కోరు వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: మార్ష్ (సి) స్టబ్స్ (బి) కుల్దీప్ 35; పంత్ (రనౌట్) 7; మార్‌క్రమ్ (బి) అక్షర్ 11; బదోని (సి) రాహుల్ (బి) నటరాజన్ 0; పూరన్ (బి) ఎన్‌గిడి 8; సమద్ (సి) మిల్లర్ (బి) నటరాజన్ 36; ముకుల్ (సి అండ్ బి) కుల్దీప్ 14; షహబాజ్ (నాటౌట్) 15; షమీ (సి) కుల్దీప్ (బి) నటరాజన్ 1; నోర్జే (సి) స్టబ్స్ (బి) ఎన్‌గిడి 0; మొహసిన్ (సి) ముకేశ్ (బి) ఎన్‌గిడి 0; ఎక్స్‌ట్రాలు 14; మొత్తం (18.4 ఓవర్లలో ఆలౌట్) 141.

**వికెట్ల పతనం:** 1-19, 2-48, 3-49, 4-65, 5-71, 6-105, 7-138, 8-140, 9-141, 10-141.

బౌలింగ్: ముకేశ్ కుమార్ 3-0-17-0, ఎన్‌గిడి 3.4-0-27-3, అక్షర్ 3-0-17-1, నటరాజన్ 4-0-29-3, కుల్దీప్ 4-0-31-1, విప్రాజ్ 1-0-8-0.

**ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్**: రాహుల్ (సి) మొహసిన్ (బి) షమీ 0; నిసాంక (సి) పంత్ (బి) ప్రిన్స్ 1; నితీశ్ (సి) సమద్ (బి) మొహసిన్ 15; రిజ్వీ (నాటౌట్) 70; అక్షర్ (బి) ప్రిన్స్ 0; స్టబ్స్ (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు 20; మొత్తం (17.1 ఓవర్లలో 4 వికెట్లకు) 145.

వికెట్ల పతనం: 1-0, 2-21, 3-25, 4-26.

బౌలింగ్: షమీ 4-0-28-1, ప్రిన్స్ 3-0-20-2, మొహసిన్ 4-1-19-1, నోర్జే 4-0-39-0, షహబాజ్ 1-0-16-0, మార్‌క్రమ్ 1-0-13-0, సమద్ 0.1-0-6-0.

## సెంట్రల్ కాంట్రాక్ట్ పోయింది.. గ్లెన్ మ్యాక్స్‌వెల్ కెరీర్ ముగిసినట్లేనా?



ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్ట్‌ను ప్రకటించింది. 202627 సీజన్‌కు గాను 21 మందికి అవకాశం కల్పించింది. అయితే, వెటరన్ ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్‌కు అవకాశం రాలేదు. అతడికి ఎటువంటి కేటగిరీలోనూ చోటు కల్పించలేదు. మ్యాక్స్‌వెల్ 2017లో చివరిసారిగా టెస్టు మ్యాచ్ ఆడాడు. దీంతో రాబోయే సీజన్‌లో ఎక్కువ టెస్టులు ఆడే వారికే సెంట్రల్ కాంట్రాక్ట్ ఇవ్వడం గమనార్హం. భారత్, న్యూజిలాండ్, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్‌తో ఆసీస్ టెస్టు సిరీస్‌లను ఆడనుంది.

**కేవలం టీ20ల్లోనే ఉన్నప్పటికీ..**

టెస్టు జట్టులో స్థానం లేని మ్యాక్సీ గతేడాది వన్డేలకు వీడ్కోలు పలికాడు. ఈ 37 ఏళ్ల ఆటగాడు కేవలం అంతర్జాతీయ టీ20ల్లోనే కొనసాగుతున్నాడు. అయితే, గత టీ20 ప్రపంచకప్‌లోనూ పెద్దగా ప్రభావం చూపించలేదు. మళ్లీ రెండేళ్ల తర్వాత పొట్టి కప్ రానుంది. దానికోసం క్రికెట్ ఆస్ట్రేలియా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులోభాగంగా గ్లెన్ మ్యాక్స్‌వెల్‌కు చోటు కల్పించడం దాదాపు కష్టమే. దీంతో గ్లెన్ మ్యాక్స్‌వెల్ అంతర్జాతీయ కెరీర్ దాదాపు ముగిసినట్లేనని క్రికెట్ వర్గాల అంచనా.

**టెస్టులే ప్రామాణికంగా..**

ఆస్ట్రేలియా సెంట్రల్ కాంట్రాక్ట్ లిస్ట్‌ను చూస్తే టెస్టు ఫార్మాట్‌కు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లైంది. మెరుగ్గా రాణించేవారికే క్రికెట్ బోర్డు చోటు కల్పించింది. ఇటీవల టెస్టులకు రిటైర్‌మెంట్ ప్రకటించిన ఉస్మాన్ ఖవాజాకు అవకాశం దక్కలేదు. భారత్‌తో బోర్డర్ గావస్కర్ ట్రోఫీ 2024లో అదరగొట్టిన ఓపెనర్ కొన్‌స్టాస్ ఇటీవల తేలిపోయాడు. దీంతో అతడినీ పక్కన పెట్టేసింది.

**ఇదీ జాబితా:** జేవియర్ బార్ట్‌లెట్, స్కాట్ బార్ట్‌లెట్, అలెక్స్ కేరీ, పాట్ కమిన్స్, బ్రెండన్ డగెట్, నాథన్ ఎలిస్, కామెరూన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మాథ్యూ కున్హెమన్, మార్నస్ లబుషేన్, నాథన్ లయన్, మిచెల్ మార్ష్, టాడ్ మార్ఫీ, మైకెల్ నెసెర్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, జేక్ వెదర్లాండ్, బ్యూ వెబ్‌స్టర్, ఆడమ్ జంపా

## అదొక్కటి మీకు చెప్పను: లఖ్‌నవూ కోచ్



ఐపీఎల్ 2026 సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తొలి మ్యాచ్‌ను ఆడేందుకు సిద్ధమైంది. మరికాసేపట్లో ఏకనా స్టేడియం వేదికగా దిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. కెప్టెన్ రిషభ్ పంత్ ఎలా ఆడతాడనేది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తి నెలకొంది. మరోవైపు అతడు ఏ స్థానంలో బ్యాటింగ్‌కు వస్తాడనేది కూడా కీలక అంశమే. గత సీజన్‌లో అతడు కేవలం 269 పరుగులు మాత్రమే చేశాడు. అందులో ఒక సెంచరీ కూడా ఉంది. తన రూ. 27 కోట్ల ప్రైస్ ట్యాగ్‌కు న్యాయం చేయాల్సిన బాధ్యత అతడిపై ఉంది. ఈ క్రమంలో పంత్‌ను ఎక్కడ ఆడిస్తారని లఖ్‌నవూ ప్రధాన కోచ్ జస్టిన్ లాంగర్ ఎదుట ప్రశ్న ఉత్పన్నమైంది. ప్రీమ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అతడు మాట్లాడాడు. ''ఈ ప్రశ్న అడిగినందుకు ధన్యవాదాలు. దీనికి సమాధానం నేను చెప్పను. మీరే మ్యాచ్‌లో చూడాలి. రిషభ్ పంత్ ఎక్కడైనా ఆడే సత్తా ఉన్న ప్లేయర్. నేను ఇప్పుడే చెబితే దిల్లీ క్యాపిటల్స్ అందుకు సన్నద్ధమవుతుంది. ఇవాళ రాత్రి 7.30గంటలకే మీరు చూస్తారు. దూకుడుగా ఎలా ఆడటం తెలుసో.. ఇన్నింగ్స్‌ను నిర్మించగలడు. గతేడాది కూడా చేసి చూపించాడు. ఈసారి మరింత మెరుగైన ఆటతీరు ప్రదర్శిస్తాడు'' అని లాంగర్ వెల్లడించాడు.

## నేడు కోల్‌కతాతో సన్‌రైజర్స్ మ్యాచ్

**రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం**

కోల్‌కతా: ఐపీఎల్‌లో మాజీ చాంపియన్లు అయిన రెండు జట్ల మధ్య పోరుకు రంగం సిద్ధమైంది. ఈడెన్ గార్డెన్స్‌లో నేడు జరిగే మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడుతుంది. ఈ రెండు జట్లు కూడా తమ తొలి మ్యాచ్‌లలో ఓడిన నేపథ్యంలో మొదటి గెలుపుపై దృష్టి పెట్టాయి. సొంత మైదానంలో ప్రత్యర్థికంటే కేకేఆర్‌దే కాస్త పైచేయిగా కనిపిస్తోంది. 201, 220... తమ మొదటి మ్యాచ్‌లో బెంగళూరుపై హైదరాబాద్, ముంబైపై కోల్‌కతా చేసిన స్కోర్లు ఇవి. అయినా సరే వాటికి ఓటమి తప్పలేదు. బౌలింగ్ బలహీనతల కారణంగా పరాజయం ఎదుర్కొన్న టీమ్‌లు ఎలా వ్యూహరచన చేస్తాయనేది ఆసక్తికరం. ప్యాట్ కమిన్స్ లేకపోవడంతో ఇప్పటికే హైదరాబాద్ బౌలింగ్‌లో పస తగ్గింది. జైదేవ్ ఉనాద్కట్, హర్షల్ పటేల్, హర్ష్ దూబె బౌలింగ్‌తో కోల్‌కతాను ఏమాత్రం నిలువరించగలరో చూడాలి. తొలి మ్యాచ్‌లో విఫలమైన హెడ్, అభిక్ శర్మ చెలరేగితే తిరుగుండదు. ఇషాన్, క్లాసెన్ తమ ఫామ్‌ను ఇప్పటికే చూపించు కున్నారు. మరోవైపు కేకేఆర్ బౌలింగ్ పరిస్థితి కూడా ఇబ్బందికరంగానే ఉంది. వైభవ్ తేలిపోగా, ముజరబానికి తగినంత అనుభవం లేదు. వరుణ్ కూడా భారీగా పరుగులివ్వడంతో టీమ్‌లో ఆందోళన రేపే అంశం. బ్యాటింగ్‌లో రహానే, అలెన్ శుభారంభం అందించాల్సి ఉంది. ఐపీఎల్‌లో కోల్‌కతా, హైదరాబాద్ మధ్య 30 మ్యాచ్‌లు జరిగాయి. 20 మ్యాచ్‌ల్లో కోల్‌కతా, 10 మ్యాచ్‌ల్లో హైదరాబాద్ గెలిచింది. కోల్‌కతాపై హైదరాబాద్ అత్యధిక స్కోరు 278 కాగా, అత్యల్ప స్కోరు 113. హైదరాబాద్‌పై కోల్‌కతా అత్యధిక స్కోరు 208 కాగా, అత్యల్ప స్కోరు 101గా ఉంది.



## నిన్నటి వరకూ భారత్‌ది..

# ఇప్పుడు కివీస్‌దే ఆ రికార్డు



మహిళా క్రికెట్‌లో సరికొత్త రికార్డు నమోదైంది. నిన్నటివరకూ ఆ ఘనత టీమ్ఇండియా ఖాతాలో ఉంది. ఇప్పుడు న్యూజిలాండ్ మహిళా జట్టు రికార్డు సృష్టించింది. దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో భారీ టార్గెట్‌ను ఛేదించింది. మహిళా క్రికెట్ చరిత్రలో ఇదే అత్యధిక లక్ష్య ఛేదన కావడం గమనార్హం. మూడు వన్డేల సిరీస్‌లో మొదటి మ్యాచ్‌ను దక్షిణాఫ్రికా గెలిచింది. ఇక రెండో మ్యాచ్‌లోనూ విజయం సాధిస్తే సిరీస్ సఫారీలదే. కానీ, కివీస్ ఆ ఛాన్స్ ఇవ్వలేదు. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 346/6 స్కోరు చేసింది. ఇంత చేశాక ఓడిపోవడం అసాధ్యమే కదా.. కానీ, న్యూజిలాండ్ చరిత్రను తిరగరాసేలా విజయం సాధించింది. 49.4 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 350 పరుగులు చేసి గెలిచింది. దీంతో మహిళా క్రికెట్ లో అత్యధిక లక్ష్య ఛేదన చేసిన జట్టుగా అవతరించింది. అంతకుముందు కివీస్ పైనే భారత్ 341/5 టార్గెట్‌ను ఛేదించి విజయం సాధించింది. ఇప్పుడు ఆ రికార్డు కనుమరుగైంది.

చితక్కొట్టిన అమెలియా కెర్

ఓవైపు భారీ లక్ష్యం. ఓపెనర్ల నుంచి మెరుపు ఆరంభమే రాలేదు. కానీ, అమెలియా కెర్ (179*: 139 బంతుల్లో 23 ఫోర్లు, ఒక సిక్స్) దూకుడు ప్రదర్శించింది. ఫోర్లతో విరుచుకుపడింది. ఆమెకుతోడుగా ఇసాబెల్లా గేజ్ (68) అండగా నిలిచింది. అయితే, దక్షిణాఫ్రికా బౌలర్లు విజృంభణతో.. స్వల్ప వ్యవధిలో మూడు వికెట్లు పడటంతో కివీస్ శిబిరంలో ఆందోళన మొదలైంది. కానీ, కెర్ మాత్రం పట్టువిడవకుండా చివరివరకూ ఉండిపోయింది. చివరికి 49.4 ఓవర్లలో కివీస్ లక్ష్యాన్ని పూర్తిచేసి విజయం సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా అమెలియా కెర్ నిలిచింది. మూడు వన్డేల సిరీస్‌లో ఇరు జట్లూ 11 సమంగా నిలిచాయి. ఆఖరి వన్డే ఏప్రిల్ 4వ తేదీన జరగనుంది.



## ఆ స్వీటే సీక్రెట్ ఆఫ్ మై ఎనర్జీ ..వైభవ్ సూర్యవంశీ

**2026లో భాగంగా సోమవారం చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ జరిగిన విషయం తెలిసిందే. ఈ పోరులో రాజస్థాన్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ (Vaibhav Suryavanshi) ఈ మ్యాచ్‌లో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. మ్యాచ్ అనంతరం.. జట్టు బస్సులో ప్రయాణిస్తున్నప్పుడు ధ్రువ్ జురేల్, వైభవ్ సూర్యవంశీ మధ్య సరదా సంభాషణ చోటుచేసుకుంది. 'బాగా ఆడావు యంగ్‌స్టర్.. చాలా బాగా ఆడావు' అని ధ్రువ్ జురేల్.. వైభవ్‌ను ప్రశంసించాడు. 'ఈ రోజు మ్యాచ్‌కు ముందు రాజ్‌భోగ్ మిఠాయి తిన్నాను' అని సూర్యవంశీ సరదాగా సమాధానమిచ్చాడు. వైభవ్ కేవలం బ్యాట్‌తోనే కాదు.. చమత్కారమైన మాటల్లోనూ దిట్ట అని చాటుకున్నాడు.**